ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 25 మార్చి 2024 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమ) సా.6.24
సహరి(మంగళ) ఉ.4.42

ఎండా కాలమ్
	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	38.0	23.0



జన..నిర్మలగిరి

దేవరపల్లి మండలం నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు..మోకాళ్ల మెట్లు ఎక్కి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తలనీలాలు ఇచ్చారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందూ సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. ఎక్కడెక్కడి నుంచో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కొండంతా జనంతో నిండిపోయింది. విద్యుద్దీపాలతో నిర్మలగిరి కొండంతా వెలిగిపోయింది. -7లో

రాజమండ్రి లోక్‌సభకు పురందేశ్వరి



సీనియర్ ఎన్‌టీఆర్ కుమార్తెగా సుపరిచితం

- కూటమి అభ్యర్థిగా ప్రకటించిన బీజేపీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా తనదైన ముద్ర
- జాతీయ రాజకీయాల్లో రాణిస్తున్న వైనం
- గతంలో కేంద్ర మంత్రిగా చేసిన అనుభవం
- టీడీపీ-జనసేన- బీజేపీ శ్రేణుల్లో జోష్
- త్వరలో రాజమహేంద్రవరానికి రాక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేరు ఖరారైంది. ఎప్పటి నుంచో ఆమె అభ్యర్థిత్వంపై ప్రచారం ఉన్నప్పటికీ ఆదివారం రాత్రి బీజేపీ జాతీయ నాయకత్వం ఆమె పేరును ఖరారు చేసింది. రాష్ట్రంలో ఆరుగురు లోక్‌సభ అభ్యర్థుల పేర్లు ప్రకటించారు.అందులో పురందేశ్వరి పేరు కూడా ఉంది. ఆమె అభ్యర్థిత్వం ఖరారు కావడంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో జోష్ పెరిగింది. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ నందమూరి తారక రామారావు కుమార్తె కావడం కూటమికి బాగా కలిసి వచ్చే అంశం. అంతేగాక టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి స్వయానా సోదరి. ఎన్టీఆర్ కుటుంబం నుంచి వచ్చిన మహిళా నేతల్లో బాగా రాణిస్తున్న నేత ఆమె.గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. బీజేపీకి రాష్ట్రంలో తొలి మహిళా అధ్యక్షురాలిగా కూడా ఆమె ఎనలేని పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమె అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత బీజేపీలో కూడా జోష్‌పెరిగింది. క్యాడర్‌లో కదలిక వచ్చింది. అంతకుముందు నేతలుకేడర్ పట్టించుకోలేదని, కనీసం సొంత అనుచరులను గాలికి వదిలేశారనే అపవాదు ఉంది. అయితే పురందేశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎన్నికైన తరువాత బీజేపీలోని పాత, కొత్తనేతలందరినీ కలుపుకుంటూ ముందుకు వెళుతున్నారు. దానికి తోడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కృషితో టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు కూడా కుదిరింది.దీంతో ఆమెను చారిత్రిక రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా బరిలో దించారు. త్వరలో ఆమె ఇక్కడకు రానున్నారు.బీజేపీతో పాటు, టీడీపీ, జనసేన క్యాడర్‌ను కలుపుకుని ప్రచారం మొదలు పెట్టనున్నారు. రాజమహేంద్రవరం నుంచి గతంలో బీజేపీ రెండు సార్లు గెలిచిన సంగతి తెలిసిందే. లోక్‌సభకు రెండుసార్లు, అర్బన్ ఎమ్మెల్యే స్థానం నుంచి ఒకసారి గెలిచింది. రెండు సార్లు టీడీపీతో పొత్తు వల్లే గెలిచింది. ఈసారి ఏకంగా టీడీపీ -జనసేన కూడా కలవడంతో బీజేపీ అభ్యర్థికి బాగా బలం పెరిగినట్టు అయింది. ఈ లోక్‌సభ స్థానం గోదావరికి ఇటు ఇటూ ఉన్న ప్రాంతం. ఈ స్థానం టీడీపీకి కంచుకోట. పోల్‌మేనేజ్‌మెంట్ వర్గాల సమీకరణ వ్యూహాత్మకంగా ఉంటే టీడీపీ నుంచి ఈ స్థానాన్ని ఎవరూ తన్నుకుపోలేనంత క్యాడర్ టీడీపీకి ఉంది. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికలలో టీడీపీ మూడు సార్లు, బీజేపీ రెండు సార్లు, కాంగ్రెస్ నాలుగు సార్లు, వైసీపీ ఒకసారి గెలిచాయి. కానీ గెలిచిన ప్రతిసారి ఓట్లశాతం పరిశీలించినా, మెజార్టీ శాతం పరిశీలించినా టీడీపీయే అధికంగా ఓట్లు తెచ్చుకోవడం గమనార్హం. రాష్ట్ర విభజన తర్వాత మొదటగా జరిగిన 2014లో జరిగిన ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి సినీనటుడు మాగంటి మురళీ మోహన్ ఘన విజయం సాధించారు. అప్పట్లో 6,30,573 ఓట్లు అంటే 54.62 శాతం ఓట్లు సాధించారు. అంతకు ముందు జరిగిన ఎన్నికల కంటే అదనంగా 19.72 శాతం సాధించారు. ఇంత వరకూ ఎవరికీ రానంత మెజార్టీ ఆయనకు వచ్చింది. ఏకంగా 1,67,434 ఓట్ల మెజార్టీ లభించింది.ఇది 14.29 శాతం మెజార్టీ. అప్పట్లో వైసీపీ తరపున పోటీ చేసిన బొడ్డు వెంకటరమణ చౌదరికి 4,63,139 ఓట్లు వచ్చాయి.అది 40.12 శాతం. కానీ 2019లో తెలుగుదేశం, జనసేన వేర్వేరుగా పోటీచేసి దెబ్బతిన్నాయి. టీడీపీ తరపున మాగంటి మురళీమోహన్ కోడలు మాగంటి రూప పోటీ చేసి 4,60,390 ఓట్లు అంటే 36.82 శాతం తెచ్చుకోగలిగారు. జనసేన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ పోటీ చేసి 1,55,807 ఓట్లు అంటే 12.46 శాతం సాధించారు. ఈ ఇద్దరి మధ్య ఓట్లు చీలిపోవడంతో వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ 5,82,024 ఓట్లు అంటే 46.55 శాతం ఓట్లు సాధించి 1,21,634 ఓట్లు మెజార్టీ సాధించారు. ఇది 9.73 శాతం మెజార్టీ.. ఈసారి ఈ లెక్కలే కాక, అధికార పార్టీ మీద ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, టీడీపీ,జనసేన, బీజేపీ ఐక్యత వల్ల ఉమ్మడి అభ్యర్థి బలమే ఎక్కువ ఉంటుంది. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థిగా డా.గూడూరి శ్రీనివాసరావు బరిలో ఉన్న సంగతి తెలిసిందే. ఇక్కడ ద్విముఖ పోటీనే ఉంటుంది. ఈ లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ నేతలు చాలా మంది ఆశపెట్టుకున్నారు. రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఇక్కడ టికెట్ ఆశించారు. రాజానగరం టికెట్ ఇస్తానని మొదట్లో టీడీపీ అధిష్ఠానం అయనకు హామీ ఇచ్చింది. పొత్తులో అది జనసేనకు కేటాయించడంతో చివరకు లోక్‌సభ స్థానం నుంచి అవకాశం ఉంటుందనే ప్రచారం జరిగింది. 2014లో అయన వైసీపీ అభ్యర్థిగా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్, శిష్టా లోహిత్, గన్ని కృష్ణ, పార్టీ సమన్వయకర్త వై.రవి, వంటి వారు టికెట్ ఆశించారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు వల్ల కూటమి అభ్యర్థిగా పురందేశ్వరి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో మూడు పార్టీల్లోనూ జోష్ పెరిగింది.

ఉల్లంఘనులు నిజమే!

- నిబంధనలు మీరారని 96 కేసులు నమోదు
- సీ విజిల్ ద్వారా 151 ఫిర్యాదులు
- ఆంధ్రజ్యోతి కథనం అక్షర సత్యం

రాజమహేంద్రవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్న బాధ్యతా రహిత ఘనులపై 'ఈసీ చెప్పినా లెక్కలేదా' అనే శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం అక్షర సత్యమని అధికారులు వెల్లడించిన వివరాలు రుజువు చేశాయి. ఈ నెల 16న సాయంత్రం 3 గంటల సమయంలో ఎన్నికల షెడ్యూల్‌ని ప్రకటించారు.ఆ క్షణం నుంచీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. వెంటనే అధికార యంత్రాంగం చేయాల్సిన పనులను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా నిర్దేశించారు. 24, 48, 72 గంటల్లో కచ్చితంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చారు. అప్పటి నుంచీ ఉల్లంఘనలపై ప్రతి రోజూ 'ఆంధ్రజ్యోతి' హెచ్చరిస్తూనే ఉంది. అయితే 72 గంటల తర్వాత కూడా 24గంటల్లో జరగాల్సిన పనులు పూర్తి కాలేదు. అధికార పార్టీ హోర్డింగులు, ఫ్లెక్సీలు, బోర్డులు వంటివి తొలగించలేదు. ప్రధాన కూడళ్లలో ఉన్న వాటినీ వదిలేశారు. ప్రజాప్రతినిధులు ఈసీ ఆదేశాలపై పట్టింపు లేకుండా వ్యవహరించారు. వీటిపై మేలుకొలుపుతూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. అదే రోజున జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత ఓ సమావేశంలో పలు వివరాలను వెల్లడించారు. ఉల్లంఘనలపై తనిఖీలు చేస్తూ కేసులు పెడుతున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై పలు సెక్షన్ల ప్రకారం 96 కేసులు నమోదు చేశారన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా 151 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిలో రాజమండ్రి అర్బన్, రూరల్ నుంచి 61 ఉండడం గమనార్హం. ఎక్సైజ్‌కి సంబంధించి 13 కేసులు పెట్టారన్నారు. ఇవన్నీ 'ఆంధ్రజ్యోతి'లో 17వ తేదీ నుంచి ఉల్లంఘనలపై వెలువడిన కథనాలు నిజమేనని రుజువు చేస్తున్నాయి. ఉమెన్స్ కళాశాల జంక్షనులో జగన్ బొమ్మలతో ఉన్న పెద్ద హోర్డింగులు, శ్యామలా సెంటర్‌లో కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచి నిర్మాణ స్థలంలో జగన్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలు, తాడితోట జంక్షను సమీపంలోని రైల్వే స్థలంలో జగన్ బొమ్మతో హోర్డింగు తదితరాలను 'ఆంధ్రజ్యోతి' చెప్పిన తర్వాతే తొలగించడం గమనార్హం. అయితే.. బాధ్యులపై చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది.

ముగిసిన కోరుకొండ నరసన్న ఉత్సవాలు

నేడు స్వామికి శ్రీ పుష్పయాగం 7

18 మందితో జనసేన జాబితా

కందుల దుర్గేష్, బత్తుల బలరామకృష్ణ పేర్లు ధ్రువీకరణ

రాజమహేంద్రవరం, మార్చి24(ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాత కొత్త 18 మంది అభ్యర్థులతో ఆదివారం రాత్రి జాబితా విడుదల చేశారు.జిల్లాలో ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థులను మళ్లీ అధికారికంగా ధ్రువీకరించించారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు నేపథ్యంలో ఇతర జిల్లాల్లో కొన్ని చోట్ల ప్రకటించిన అభ్యర్థులను కూడా మార్చిన నేపథ్యంలో అధికారికంగా జాబితా విడుదల చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లాలో కందుల దుర్గేష్(నిడదవోలు), బత్తుల బలరామకృష్ణ (రాజానగరం)ఉన్నారు.వీరిని గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే.

కోట సత్తెమ్మకు కోటి దండాలు



నిడదవోలు, మార్చి 24 : కోట సత్తెమ్మకు కోటి దండాలు అంటూ అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున కొలిచారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది.పెద్ద ఎత్తున హాజరైన భక్తజనం అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,21,984 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- క్షయ నివారణాధికారిణి డాక్టర్ వసుంధర

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 24 : జిల్లాను క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నివారణాధికారిణి డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాజమహేంద్రవరం జిల్లా క్షయ నివారణ కార్యాలయంలో క్షయ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 109 పంచాయతీలు టీబీ ముక్త పంచాయతీలుగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. జిల్లాలో 2023లో 51,668 టీబీ కఫం పరీక్షలు నిర్వహించగా 2946 కేసులు నమోదైనట్టు తెలిపారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే నివారణ సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఇతర వైద్యసిబ్బంది, నర్సింగ్ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.



కోకో.. ధర బాగు

పెరవలి,మార్చి 24 : కోకో గింజలు ధర గోగో అంటుంది.. రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం కేజీ గింజల ధర రూ.650 నుంచి రూ.700 వరకు పలుకుతుంది.గతేడాది ఇదే రోజుల్లో కేజీ గింజలు ధర రూ.200 నుంచి రూ.240 మాత్రమే పలికింది. ఈ ఏడాది జనవరి నెల నుంచి క్రమక్రమంగా పెరుగుతూ ప్రస్తుతం రూ.700లకు చేరుకోవడంతో కోకో రైతుల్లో ఆనందం నెలకొంది. ఈ ఏడాది కోకో కాయలు కాపు తక్కువగా ఉండడం వల్లే కంపెనీల మధ్య పోటీ ఏర్పడి ధర పెరిగినట్టు చెబుతున్నారు.అయితే ధర ఎంత వరకూ నిలబడి ఉంటుందనేది చెప్పలేమని కొనుగోలుదారులు చెబుతున్నారు. రైతులు గతం నుంచి రూ.300లకు విక్రయిస్తూ వచ్చారు. అలా అమ్మిన రైతులు ప్రస్తుత ధర చూసి బాధపడుతున్నారు. కోకో కాయలు కాపు తక్కువగా ఉన్నా.. కాచిన కాయలు సైజు మాత్రం పెద్దగా ఉంటుందని లోపల గింజ సైజు కూడా పెద్దగా ఉంటుందని చెబుతున్నారు. గింజ నాణ్యత బాగుండడంతో కంపెనీలు పోటీ పడి కొనుగోలు చేస్తున్నాయి.

నాణ్యతగా ఆరబెట్టాలి

కోకో కాయలు కోసిన అనంతరం కాయలు నుంచి గింజలు వేరు చేస్తారు. అనంతరం వాటిని రాశిగా పోసి నాలుగైదు రోజుల పాటు పులియబెడతారు.ఈ క్రమంలో ఆ గింజలు రంగు మారతాయి. అనంతరం వాటిని ఎండలో ఆరబెట్టి విక్రయిస్తారు. కొంత మంది ఈ విధానం సక్రమంగా పాటించకపోవడం వల్ల గింజల్లో నాణ్యత రావడం లేదని కంపెనీలు ఆవేదన చెందుతున్నాయి.కాయలు నుంచి వేరు చేసిన 1,2 రోజులకే ఆరబెడుతున్నారని దీంతో అవి రంగు మారకుండా తెల్లగా అవుతున్నాయని.. రైతులు సరైన విధానం పాటించాలని కోరుతున్నారు.

అనపర్తిలో.. ఆందోళన



తాడోపేడో తేల్చుకుందాం : టిక్కెట్ మార్పుపై వస్తున్న వార్తల నేపథ్యంలో విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశానికి నల్లమిల్లి వెళ్లకుండా ఆపుతున్న టీడీపీ-జనసేన నాయకులు

సీటు బీజేపీకి కేటాయిస్తారన్న ప్రచారంపై భగ్గుమన్న టీడీపీ - జనసేన శ్రేణులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అనపర్తి సీటుపై ఆందోళన పెరిగింది. ఈ సీటు బీజేపీ ఆశిస్తున్నట్టు ప్రచారం జరగడంతో ఆందోళన మొదలైంది. టీడీపీ తొలి జాబితాలోనే అనపర్తి నుంచి కూటమి అభ్యర్థిగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయన విస్తృతంగా ప్రచారం కూడా చేస్తున్నారు.కానీ టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు ఖరారైన తర్వాత రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానాన్ని అడిగిన బీజేపీ, అనపర్తి అసెంబ్లీ స్థానాన్ని కూడా కోరినట్టు ప్రచారం జరుగుతోంది. ఆదివారం రాత్రి ఢిల్లీ నుంచి రాష్ట్రంలో బీజేపీ పోటీ చేసే 6 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు.ఈ నేపథ్యంలో అనపర్తి నుంచి కూడా బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తారేమోననే ఆందోళన మొదలైంది. బిక్కవోలు మండలం రంగాపురానికి చెందిన ఎక్స్ మిలటరీమ్యాన్ కృష్ణంరాజు అనపర్తి బీజేపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన పేరునే పార్టీవర్గాలు ప్రతిపాదించినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ టీడీపీ అధినేత చంద్రబాబు ఈ సీటును ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చేది లేదని, 42 ఏళ్ల నుంచి నల్లమిల్లి కుటుంబం టీడీపీతో ఉందని, అక్కడ ఇప్పటికే రామకృష్ణారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించామని కూడా స్పష్టం చేసినట్టు సమాచారం. ఢిల్లీలో కూడా దీనిపై చర్చ జరిగినట్టు సమాచారం. వైసీపీ నేత ఒకరు, మరొక పార్టీకి చెందిన నేత ఒకరు కుమ్మక్కయి,ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించేలా ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. అనపర్తి ఇవ్వకపోతే, రాజమహేంద్రవరం రూరల్ లేదా అర్బన్ ఇవ్వమని బీజేపీ జాతీయ స్థాయి నేత షెకావత్ చంద్రబాబును అడిగి నట్టు సమాచారం. ఆ ప్రతిపాదన పెట్టవద్దని.. అవి మార్చేసీటు్లు కాదని స్పష్టం చేయడం గమనార్హం. రాజమహేంద్రవరం రూరల్, సిటీలలో ఇబ్బంది లేదుకానీ..అనపర్తి విషయంలో కొంత సందిగ్ధత నెలకొంది. ఇక్కడ అభ్యర్థి రామకృష్ణారెడ్డి ఐదేళ్ల నుంచి నిత్యం పోరాడుతూ ప్రజల్లో ఉంటున్న సంగతి తెలిసిందే. అంతేకాక ఇక్కడ రామకృష్ణారెడ్డి సీటును మారిస్తే, అది లోక్‌సభ స్థానంపై కూడా ప్రభావం చూపుతుందనే వాదన ఉంది. ఈ పరిస్థితులు ప్రస్తుతం రాష్ట్రంలోని బీజేపీకి కేటాయించిన 10 స్థానాల్లో 9 స్థానాలనే ముందుగా ప్రకటించే అవకాశం ఉందని, అనపర్తి గురించి పునారాలోచించడమో లేక, బీజేపీ 9 స్థానాలతో సరిపెట్టుకోవడమో జరుగుతుందనే వాదన ఉంది. అయినా అనపర్తి టీడీపీ శ్రేణుల్లో ఆందోళన కొనసాగుతోంది. ఇక్కడ మరొక ప్రచారం కూడా ఉంది. అనపర్తి తప్పనిసరిగా బీజేపీకి ఇస్తే రామకృష్ణారెడ్డికి కానీ, ఆయన కుమారుడికి కానీ బీజేపీ కండువా కప్పి పోటీ చేయించే అవకాశం ఉన్నట్టు సమాచారం. టీడీపీ వర్గాల్లో ఆందోళన ఉన్నప్పటికీ ఈ సీటు టీడీపీదేననే నమ్మకంతో ఉన్నారు. ఆదివారం రామకృష్ణారెడ్డి ప్రచారానికి వెళుతుంటే, దీనిపై స్పష్టత వచ్చే వరకూ వెళ్లవద్దని శ్రేణులు అడ్డుకోవడం గమనార్హం. ఈ స్థానం నుంచి బీజేపీ ఎప్పుడూ గెలవలేదు. టీడీపీ అనేక సార్లు గెలిచింది. పొత్తు వల్ల ఎటువంటి పరిణామాలు సంభవిస్తాయో చూడాలి.

అనపర్తి టికెట్‌పై వైసీపీ కుట్ర

అధైర్యపడవద్దు..టిక్కెట్ మనదే..

టీడీపీ జనసేన శ్రేణులతో నల్లమిల్లి

అనపర్తి టికెట్ మార్పు అంశం పూర్తిగా అధికార పార్టీ చేస్తున్న కుట్రలో భాగం.. ఐదేళ్లుగా మనం వైసీపీ అవినీతి అక్రమాలపై చేస్తున్న పోరాటం వృథా కాదు. చంద్రబాబు మనకి అన్యాయం చేయరు. టీడీపీ జన సేన శ్రేణులు అధైర్యపడవద్దు.. శనివారం విజయవాడలో జరిగిన సమావేశంలో పాల్గొన్న తరువాత తాను చంద్రబాబుతో సమావేశమై పలు అంశాలను చర్చించా.. సీటు మార్పు వెనుక వైసీపీ చేస్తున్న కుట్రను అధినేత చంద్రబాబుకు వివరించా. సీటు అంశంపై ఆందోళన పడవద్దని చంద్రబాబు తనతో అన్నారు. అనపర్తి నియోజకవర్గం బీజేపీకి కేటాయిస్తే రాజమండ్రి పార్లమెంటు స్థానానికి ఇబ్బందులు ఎదురవుతాయని చంద్రబాబుకు వివరించా.. సీటు అంశంపై కార్యకర్తలు ఆందోళన చెందవద్దు.

- టీడీపీ సీటు బీజేపీకా..?
- లోక్‌సభ సీటుపైనా ప్రభావం
- మిలట్రీ మ్యాన్ కృష్ణంరాజు పేరు?
- నియోజకవర్గంలో అయోమయం
- శ్రేణుల్లో తీవ్ర నిరుత్సాహం
- కుదరదన్న చంద్రబాబు
- పట్టుబడుతున్న బీజేపీ
- నాయకుల అసహనం
- అన్యాయం చేయవద్దని డిమాండ్

సీటు మారిస్తే ఊరుకోం

- టీడీపీ-జనసేన శ్రేణుల నిరసన
- ప్రచారానికి వెళ్లకుండా అడ్డగింత
- వెనుదిరిగిన నల్లమిల్లి
- అధిష్ఠానం తీరుపై తీవ్ర ఆగ్రహం
- సీటు సంగతి తేల్చాలని డిమాండ్
- బీజేపీకి ఎలా ఇస్తారని ప్రశ్న
- వైసీపీ కుట్ర అంటూ నినాదాలు

అనపర్తి, మార్చి 24 : అనపర్తి అసెంబ్లీ స్థానాన్ని పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయిస్తున్నారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో నియోజకవర్గంలో టీడీపీ-జనసేన శ్రేణులు ఆదివారం భగ్గుమన్నాయి. అనపర్తి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా మొదటి జాబితాలోనే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించారు. తరువాత జరిగిన పరిణామాల్లో రెండు పార్టీలు బీజేపీతో జతకట్టాయి. ఇటీవల బీజేపీకి కేటాయించిన పది అసెంబ్లీ స్థానాల్లో అనపర్తి కూడా ఉందని ప్రచారం జరుగుతూ వచ్చింది. అయితే ఇది ప్రచారం కాదని వారు అడుగుతున్న సీట్ల జాబితాలో అనపర్తి కూడా ఉందని తేలడంతో ఆదివారం టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ముందుగా బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించేందుకు వెళ్ళిన నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మిని టీడీపీ జనసేన పార్టీ శ్రేణులు అడ్డుకున్నారు. అనపర్తి సీటుపై టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన ప్రకటన చేయాలని అప్పటి వరకు ప్రచారం చేయవద్దని నాయకులు పట్టుబట్ట డంతో ఆమె అక్కడి నుంచి వెనుదిరిగారు. రంగంపేట మండలం నల్లమిల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించేందుకు వెళ్లిన నల్లమిల్లి తనయుడు మనోజ్‌రెడ్డిని కూడా రంగంపేట టీడీపీ జనసేన నాయకులు కార్యకర్తలు అడ్డుకుని సీటుపై క్లారిటీ వచ్చే వరకు ప్రచారం నిర్వహించవద్దంటూ అడ్డుకోవడంతో ఆయన వెనుదిరిగారు. బిక్కవోలులో అనపర్తి నియోజకవర్గ విశ్వ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో పాల్గొనేందుకు ఉమ్మడి అభ్యర్థి రామకృష్ణారెడ్డి వస్తున్నారన్న విషయం తెలుసుకున్న రంగంపేట, బిక్కవోలు మండలాలకు చెందిన టీడీపీ జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని నల్లమిల్లిని ఆత్మీయ సమావేశానికి హాజరు కాకుండా నిలుపుదల చేశారు.అనపర్తి సీటుపై అధిష్ఠానం స్పష్టత ఇవ్వాలని పలు వురు నాయకులు డిమాండ్ చేశారు. నియోజకర్గంలో బీజేపీకి చెప్పుకోదగ్గ నాయకుడు కూడా లేని పార్టీకి టికెట్లు ఎలా ఇస్తా రంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు కార్యకర్తల అభీష్టం మేరకు ఆత్మీయ సమావేశంలో పాల్గొనకుండానే రామకృ ష్ణారెడ్డి వెనుదిరిగారు. అనపర్తి సీటు టీడీపీని కాదని బీజేపీకి ఎలా కేటాయిస్తారని..గత ఎన్ని కల్లో 615 ఓట్లు సాధించిన పార్టీకి కేటాయిస్తే విజయం సాధించడం కష్టమని టీడీపీ జిల్లా తెలుగురైతు అధ్య క్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు అన్నారు. ఇదే అదునుగా వైసీపీ బలం పుంజుకోవాలని చూస్తుందన్నారు.పార్టీ ప్రతిష్ఠను పెంచేందుకు రామకృష్ణారెడ్డి రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడుతున్నారని దీనిపై అధిష్ఠానం వెంటనే స్పందించి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే టీడీపీకి రాజీనామాలు చేసేందుకు కూడా పార్టీ శ్రేణులు సిద్ధపడుతున్నా రన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తమలంపూడి సుధా కరరెడ్డి, సత్తి దేవదాన రెడ్డి, కర్రి వెంకటరామా రెడ్డి, వైజాగ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వదలొద్దు : ప్రచారానికి వెళ్లకుండా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భార్య మహాలక్ష్మిని ఆపుతున్న టీడీపీ-జనసేన శ్రేణులు

లక్ష్మీనరసింహుని చక్రతీర్థం


చక్రస్నానం


కోనేరు వద్దకు పల్లకిలో వెళ్తున్న స్వామివారు

కోరుకొండ, మార్చి 24:

కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం దేవుని కోనేటి వద్ద చక్ర పెరుమాళ్లకు నరసింహస్వామి, అనంత పద్మనాభస్వామి సమక్షంలో చక్రతీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యుల బ్రహ్మత్వంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ పర్యవేక్షణలో ఆలయ అనువంశిక అర్చకస్వాములు, చక్రపెరుమాళ్లకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అంతకు ముందు స్వామి దిగువ దేవస్థానంలో ప్రత్యేక సేవాకాలం నిర్వహించి నరసింహ, పద్మనాభ స్వాములను చెరో పల్లకిలో ఆశీనులు చేసి మేళతాళాలు, మంత్రోచ్ఛారణలతో దేవుని కోనేటి వద్దకు తీసుకుని వచ్చారు. అనంతరం అక్కడ చక్రపెరుమాళ్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి కోనేటిలో చక్రతీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు చక్రస్నానాలు ఆచరించారు. తదుపరి స్వామివార్లు ఆలయానికి చేరుకున్నారు.

ఊయల సేవ

నరసన్న కల్యాణోత్సవాలు చివరి రోజు ఆదివారం రాత్రి స్వామివారి ఆలయ మండపంలో ప్రత్యేక ఊంజలసేవ (ఊయల సేవ) నిర్వహించారు. ఇందుకోసం స్వామి కల్యాణ మండపాన్ని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. కల్యాణ వేదికపై ఊయలలో ఆశీనులైన నరసింహ స్వామిని ఎదురుగా ఉన్న పెద్ద అద్దంలో భక్తులు దర్శించుకున్నారు. లక్ష్మీనరసింహస్వామికి కోరుకొండ నాలుగు మాడవీధుల్లో శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు స్వామి వారిని చివరిసారిగా దర్శించుకుని మంగళ నీరాజనాలు అందజేశారు.


చక్రపెరుమాళ్లకు పంచామృత అభిషేకాలు

ముగిసిన ఉత్సవాలు

నరసింహస్వామి కల్యాణోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) ఆదివారం అర్ధరాత్రితో వైభవంగా ముగిశాయి. అంతకుముందు స్వామి వారి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. చివరి ధ్వజాన్ని అవరోహణం చేయడం ద్వారా ఉత్సవాలు శాస్త్రోక్తంగా పరిసమాప్తమయ్యాయి.

ముగిసిన పండిత సభలు

నరసన్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో ఐదు రోజులుగా జరుగుతున్న 92వ పండిత సభలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఎందరో పండితులు ఈ ఆధ్యాత్మిక సభల్లో పాల్గొని భారత, భాగవత, రామాయణ, ఇతిహాసాల్లోని అనేక విషయాలను, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఆళ్వారులు ప్రబంధంలోని అనేక భగవత్ విషయాలను వివరించారు. ముగింపు సందర్భంగా సభల్లో పాల్గొన్న పండితులందరినీ ఘనంగా సత్కరించారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా కోరుకొండకు వచ్చిన భక్తులకు స్థానిక మిరియాల వెంటరెడ్డి పంతులు ధర్మసత్రంలో ఉచిత నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు సెలవు దినం(ఆదివారం) కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. సుమారు 50 వేల మందికి పైగా అన్నప్రసాదం అందించినట్టు సత్రం ఈవో పాటి సత్యనారాయణ తెలిపారు. ఈ గ్రామోత్సవంలో పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రంగరాజభట్టర్, పరాసర రఘునాథ భట్టర్, పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశిక అర్చక స్వాములు పాల్గొన్నారు.





కిటకిటలాడిన లోవ

- మొక్కుబడులు తీర్చుకున్న భక్తులు
- ఆరుబయట సహపంక్తి భోజనాలు



తుని రూరల్, మార్చి24: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామునే తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా లోవకు తరలి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పులు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల రాకతో లోవ ప్రాంగణం సందడిగా మారింది. దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది.

సంత్రాగచ్చి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు



సామర్లకోట, మార్చి 24: హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సంత్రాగచ్చి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక హోలీ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 25న నడపనున్నట్లు విజయవాడ సీనియర్ డీసీఎం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 07646 నంబరు గల సంత్రాగచ్చి-సికింద్రాబాద్ రైలు ఆదివారం తెల్లవారుజామున 5.45 గంటలకు సంత్రాగచ్చి స్టేషన్‌లో బయలుదేరుతుంది. ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, జాజిపూర్ కియోంజాహార రోడ్, కటక్, భువనేశ్వర్, ఖుర్దారోడ్, బెరహంపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, సింహాచలం, దువ్వాడ అనకాపల్లి మీదుగా సామర్లకోటకు సోమవారం రాత్రి 10.58కు చేరుతుంది. రాజమండ్రికి రాత్రి 9.43 గంటలకు చేరి తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా విజయవాడకు అర్ధరాత్రి 1.10 గంటలకు చేరుతుంది. గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు మంగళవారం ఉదయం 8.10 గంటలకు చేరుతుంది. 24 బోగీలతో వివిధ తరగతులకు చెందిన ప్రయాణికులను తమతమ గమ్యస్థానాలకు చేర్చేందుకు 3,500 కిలోమీటర్ల దూరాన్ని 26 స్టాపులతో 96 గంటలలో చేరుతుందని రైల్వే అధికారులు చెప్పారు. మరిన్ని వివరాలకు, రిజర్వేషన్లకు సమీప రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కార్యాలయాన్ని సంప్రదించాలని రైల్వే సీనియర్ డీసీఎం సూచించారు.

ఆర్అండ్‌బీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పాపారావు


పాపారావును అభినందిస్తున్న సూర్యనారాయణ తదితరులు

కాకినాడ సిటీ, మార్చి 24: ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడ జిల్లాకు చెందిన చెల్లుబాని పాపారావు నియమితులయ్యారు. మంగళగిరిలో జరిగిన సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల సహాయంతో పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పాపారావుకు పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపి సత్కరించారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం


దాతకు స్వామివారి చిత్రపటం బహూకరణ

ఆత్రేయపురం, మార్చి 24: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి హైదరాబాద్ చంపాపేట్‌కు చెందిన వత్సవాయి సాయి రూ.లక్ష విరాళం సమర్పించారు. దాతకు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజు ఆదాయం రూ.3,02,619 లభించినట్టు ఈవో చెప్పారు.

అత్తపై అల్లుడి దాడి

- తెగిపోయిన చేతివేలు, తలపైనా గాయాలు
- కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు



బిక్కవోలు, మార్చి 24: కూతురు, మనవలను తీసుకెళ్లిపోవాలని చెప్పిన కారణంగా అత్తపై అల్లుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బిక్కవోలు మండలం ఇళ్లపల్లిపాకలు గ్రామంలో ఈ సంఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ పి.బుజ్జిబాబు అందించిన వివరాల ప్రకారం.. యానాంకు చెందిన గీసాల దుర్గా మోహన్‌కు 2013లో ఇళ్లపల్లిపాకలుకు చెందిన వాసంశెట్టి లోవకుమారితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. మోహన్ తరచూ మద్యం తాగొచ్చి భార్యను కొడుతుండడంతో ఆమె అమ్మగారి ఇంటి వద్దకు వచ్చేసింది. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు కోర్టు పరిధిలో ఉంది. ఆదివారం ఇళ్లపల్లిపాకలు వచ్చిన మోహన్‌ను తన కూతురు, మనవలను ఎందుకు తీసుకు వెళ్లడం లేదంటూ అత్త మంగ నిలదీసింది. దీంతో మాటా,మాటా పెరిగి గొడవ పడి అక్కడ ఉన్న కత్తిపీటతో మంగ తలపై దాడి చేశాడు. ఆమె చెయ్యి అడ్డుపెట్టుకోవడంతో ఆమె కుడి చేయి ఉంగరం వేలు చివరి భాగం తెగిపోయింది. తలపై నాలుగు చోట్ల బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆమెను స్థానికులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

భార్య ఎడబాటును తట్టుకోలేక ఆత్మహత్య

అనపర్తి, మార్చి 24: భార్య ఎడబాటును తట్టుకోలేక అనపర్తి మండలం కుతుకులూరులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రామారావు వివరాల ప్రకారం.. కుతుకులూరులోని కూటేశ్వర కాలనీకి చెందిన మండ వీర వెంకట సత్యనారాయణరెడ్డి(38)కి 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. సత్యనారాయణరెడ్డి తన తల్లి వద్ద ఉంటున్నాడు. భార్య ఎడబాటును తట్టుకోలేని ఆయన ఆదివారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

అన్నవరం, మార్చి 24: రత్నగిరిపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఒక దాత రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. చెల్లూరుకు చెందిన బల్ల కోటి ప్రసాద్ ఈ మొత్తాన్ని ఆలయ అధికారులకు అందజేయగా వారిని అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రంపచోడవరం, మార్చి 24: ఏజెన్సీలో గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు మడకం జోగమ్మ అన్నారు. మార్క్స్-ఏంగిల్స్ భవనంలో ఆదివారం ఆమె అధ్యక్షతన డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.అనసూయ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే నాయకులను ఎన్నుకోవాలని, కోరారు. సర్పంచ్ పల్లాల ఆదిలక్ష్మి, పీవోడబ్ల్యూ నాయకులు సాదల చిలకమ్మ, కానెం లక్ష్మి, బాపనమ్మ, కొమరం రాములమ్మ, కోటం సత్యవతి పాల్గొన్నారు.

అరకు ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత



రంపచోడవరం మార్చి 24: అరకు పార్లమెంట్ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఖరారయ్యారు. ఈ మేరకు బీజేపీ ప్రకటన వెలువరించింది. 2014-2019 మధ్య కాలంలో వైసీపీ నుంచి ఎంపీగా ఎన్నికైన గీత అప్పట్లో వైసీపీని వ్యతిరేకించి కేంద్రంలో బీజేపీతోను, రాష్ట్రంలో టీడీపీతోను సన్నిహితంగా మెలిగారు. అనంతరం ఓ పార్టీని స్థాపించిన గీత కొద్ది కాలానికి ఆ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. కొత్తపల్లి గీత బీజేపీ అరకు అభ్యర్థిగా వస్తారని కొన్ని నెలలుగా ప్రచారం జరుగుతోంది. ఆమె ఏడు సెగ్మెంట్లలో చాలా కాలం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వస్తున్నారు.

ఈవీఎంల వినియోగం ఎప్పటి నుంచి అంటే..



సామర్లకోట, మార్చి 24: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. తమకు ఇష్టమైన నాయకులను ఎన్నుకునేందుకు అవకాశం ఉంటుంది. అటువంటి ఓటును కొందరు దుర్వినియోగం చేసుకుంటే మరి కొంత మంది వినియోగించుకోవడంలోనూ తడబాటు పడుతున్నారు. ఇటీవల కాలంలో ఓట్ల గల్లంతు అనేది ప్రధానంగా మారింది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒకరి ఓట్లు వేరొకరు తొలగించుకునే వరకూ వచ్చింది. ఓటును రక్షించుకునేందుకే ఓటర్లు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇటువంటి పరిస్థితి లేదు. ఓటు తొలగించాలంటే మాన్యువల్‌గా మాత్రమే దరఖాస్తులు చేసి విచారణ చేసిన తర్వాతనే ఓట్లు తొలగింపు జరిగేది. బ్యాలెట్ పేపర్ ద్వారా ఓట్లు వేసుకునే అవకాశం ఉండేది. ఓటు లెక్కింపునకు రోజులు పట్టేవి. ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లదే పైచేయిగా మారింది. అయితే ఇవి ఎప్పటినుంచి అందుబాటులోకి వచ్చాయనే విషయం చాల మందికి తెలియదు.

మొదటి వినియోగం

ఈవీఎం విధానం వచ్చిన తర్వాత ఎన్నికల నిర్వహణ, లెక్కింపు సులభమైంది. ఈ పరికరం సుమారు 40 ఏళ్ల కిందటే అందుబాటులోకి వచ్చింది. 1982 మే 19న కేరళలోని పారూర్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా వినియోగించారు. మంచి ఫలితాలు రావడంతో 1982, 83 సంవత్సరాలలో దేశంలో జరిగిన పలు ఉప ఎన్నికలలో వినియోగించారు. అప్పటి నుంచి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగిస్తున్నారు. ఈవీఎంల తయారీ హైదరాబాద్‌లోనే జరిగేది. ఈవీఎంలను పలు రాజకీయ పార్టీలు గతంలోనే వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలోనే 1984 మే 5న సుప్రీంకోర్టు ఈవీ ఎంలను వినియోగించొద్దు అంటూ తీర్పు వెలువరించింది. 1988 డిసెంబరుతో కేంద్రప్రభుత్వం సెక్షన్ 61(ఏ) ద్వారా ప్రజా ప్రాతినిధ్య చట్టం పరిధిలో ఈవీఎంల వినియోగం అంశాన్ని చేర్చారు. 1989 మార్చి 15న సవరించడంతో సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. 1990 జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్నికల సంస్కరణలు కమిటీ ఈవీఎంలను సమర్థించింది. 1992 మార్చి 24న ఎన్నికల నియమావళి 1961ని సవరించి, అధీకృతం చేయడంతో 1998లో ప్రజామోదం లభించింది. 1998 ఎన్నికలలో పూర్తిస్థాయిలో ఈవీఎంల వినియోగం జరగకపోయినా 2004లో నిర్వహించిన ఎన్నికల నుంచి దేశవ్యాప్తంగా పూర్తిగా పేపర్ వాడకం మాని ఈవీఎంలనే వాడుతున్నారు. ఇటీవల కాలంలో ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నాయనే అనుమానాలు పలు రాజకీయ పార్టీలు లేవనెత్తాయి. తిరిగి బ్యాలెట్ పేపర్ విధానాన్నే అమలు చేయాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చాయి. భారత ఎన్నికల కమిషన్ మాత్రం ఈవీఎంల వలన ఎటువంటి ట్యాంపరింగ్ జరగడం లేదని పారదర్శకంగానే ఎన్నికలు జరుగుతున్నాయని ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. ఇందులో భాగంగానే వీవీ ప్యాట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఒక్కో ఈవీఎంలో ఎన్ని ఓట్లు..

ఒక్క పోలింగ్ బూత్‌లో 1900 మంది వరకూ మాత్రమే ఓట్లు వేసేందుకు అవకాశం కల్పించింది. 1900 దాటిన ఓటర్లు ఉంటే రెండో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని ఎన్నిక సంఘమే ఆదేశాలు జారీ చేసింది. ఒక ఈవీఎంలో 2000 వరకే ఓట్లు వేసుకునేందుకు అవకాశం ఉంది. ఒక్క పోలింగ్ బూత్‌కు ఒక ఈవీఎం ఇస్తారు. ప్రతీ ఈవీఎంలోనూ బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ వీవీ ప్యాట్‌కు అనుసంధానం చేసి ఉంటాయి. కంట్రోల్ యూనిట్ పోలింగ్ అధికారి వద్ద ఉంటుంది. ఓటరుకు ఓటు ఇవ్వాలా, వద్దా అనే విషయాన్ని నిర్ధారించుకున్న తర్వాత బ్యాలెట్ యూనిట్‌లోని తనకు నచ్చిన పార్టీ అభ్యర్థికి ఓటు వేసేందుకు తన ఎదురుగా ఉన్న బటన్ నొక్కితే ఓటు నమోదు అవుతుంది. తాము ఎవరికి ఓటు వేశామో తెలుసుకునేందుకు వీవీ ప్యాట్‌లో డిస్‌ప్లే అవుతుంది.

వీవీ ప్యాట్‌లతో ఓటు నిర్ధారణ

ఎన్నికలలో పారదర్శకత పెంచడంతో పాటు ఓటర్ల నమ్మకాన్ని చూరగొనేందుకు ఎన్నికల సంఘం 2013 ఆగస్టు 14న ఈవీఎంలకు వీవీ ప్యాట్‌లను అనుసంధానం చేసింది. వీవీ ప్యాట్ అంటే ఓటరు వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్. ఓటు నిర్ధారణ యంత్రం అని అర్థం. నాగాలాండ్ రాష్ట్రం నాక్సెస్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి సారిగా 2013 సెప్టెంబరు 4న ప్రయోగాత్మకంగా వినియోగించింది. వీవీ ప్యాట్‌లను దశలవారీగా అన్ని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం 2017 ఏప్రిల్‌లో వీవీ ప్యాట్‌ల కొనుగోలుకు కూడా ఆమోదం తెలిపింది.

కాంతిమయంగా నిర్మలగిరి



అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

దేవరపల్లి, మార్చి 24: నిర్మలగిరి మేరీమాత మహోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు మేరీ మాతను దర్శించుకున్నారు. వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి మేరీమాతను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మెట్ల మార్గం ద్వారా ప్రధాన ఆలయానికి మోకాళ్లపై ఎక్కి ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మేరీమాత స్వరూపం వద్ద కొబ్బరికాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ జాన్‌పీటర్ భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. దివ్యబలి పూజలు, పవిత్రాత్మ స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. భక్తుల రాకతో ప్రాంగణం సందడిగా మారింది


తరలివచ్చిన భక్తులు

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

'రంప' టీడీపీ టికెట్ వివాదం సమసినట్టేనా..?

వంతలతో చంద్రబాబు భేటీ..గౌరవప్రదమైన స్థానం కల్పిస్తామని హామీ

సమన్వయంతో పనిచేయాలని నేతలకు పిలుపు

రంపచోడవరం, మార్చి 24: రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో చోటు చేసుకున్న టికెట్ వివాదం ముగిసి ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, వారి వర్గాలు అధిష్ఠాన నిర్ణయమే శిరోధార్యమన్న ఏకాభిప్రాయానికి వచ్చినట్టే కనిపిస్తోంది. శనివారం విజయవాడలో జరిగిన పార్టీ అభ్యర్థుల సదస్సుకు అభ్యర్థి మిరియాల శిరీషాదేవిని ఆహ్వానించడం, అదే రోజు మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరితో చంద్రబాబు భేటీ అయిన నేపథ్యంలో చంద్రబాబు రాజీ కుదిర్చారనే సంకేతాలు వెలువడ్డాయి. సదస్సులో అభ్యర్థులకు ఎన్నికల్లో ఎలా వ్యవహరించాలన్న దిశానిర్దేశం చేసిన చంద్రబాబు అభ్యర్థి శిరీషా దేవి సూచనల మేరకు ఆమె సూచించిన వారికి పలు కమిటీల్లో స్థానం కల్పించారు. మరో పక్క రాజేశ్వరితో మాట్లాడిన చంద్రబాబు పార్టీ అండగా ఉంటుందని, తగిన విధంగా న్యాయం చేస్తుందని చెప్పినట్లు సమాచారం. రంపచోడవరం నియోజకవర్గంలో కూటమి విజయం సాధించే దిశగా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని చంద్రబాబు నేతలకు చెప్పడంతో వారి కొంచెం మెత్తబడి పార్టీ విజయం కోసం పనిచేస్తామనే ధోరణి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల్లోనే ఇక్కడి పరిస్థితులు పూర్తిగా చక్కబడతాయని, పార్టీకి వెన్నంటి ఉన్న ముఖ్యనేతలందరికీ చంద్రబాబు తగు న్యాయం చేసే విధంగా యోచిస్తున్నారని తటస్థంగా ఉండే పార్టీ సీనియర్లు స్పష్టం చేస్తున్నారు.

ఘనంగా మట్ల ఆదివారం

మోతుగూడెం, మార్చి 24: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో మట్ల ఆదివారం పండుగ ఘనంగా నిర్వహించారు. థామస్ మెమోరియల్ చర్చిలో ఫాదర్ రతన్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. డొంకరాయి వీధుల్లో ఏసు ప్రభు కీర్తనలు ఆలపిస్తూ పర్యటన చేశారు. ఈ కార్యక్రమంలో థామస్ మెమోరియల్ చర్చి సంఘస్తులు పాల్గొన్నారు.

400 మందికి వైద్య సేవలు

రంపచోడవరం, మార్చి 24: రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో సిరిగిందలపాడులో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో సుమారు 400 మందికి వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయ నందాజీ తెలిపారు. వైద్యులు గోలి వెంకటరామారావు, కస్తూరి సుబ్రహ్మణ్యం, శ్రీకృష్ణ పాతూరి, టి.వి.సుబ్బారావు, దాసరి ఉమామహేష్, ఎస్.సంపత్‌కుమార్ వైద్య సేవలందించారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 24 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఆరుగురికి కంటి ఆపరేషన్ల నిమిత్తం వేమగిరి తరలించారు. రామకృష్ణ మిషన్ మేనేజర్ స్వామి రఘువీరనందాజీ, ఆఫీస్ ఇన్‌చార్జి స్వామి వేద విద్యానందాజీ, స్వామి సవ్య నందాజీ, క్యాంపు కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వలంటీర్లు ఎల్‌బీజీ భగీరథరాజు, ఉదయ్‌కిరణ్, మంగిరెడ్డి, వి.వెంకటసూర్యచంద్రం, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహానికి ముసుగు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు



మోతుగూడెం,మార్చి 24: మోతుగూడెం సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి అధికారులు ముసుగు వేశారు. ఇక్కడ ఉన్న ఎన్టీఆర్, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు ముసుగు వేసి, వైఎస్సార్ విగ్రహానికి వేయక పోవడంపై ఆంధ్రజ్యోతిలో 'ఇదేం వివక్ష' శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. వైఎస్సార్ విగ్రహానికి ఆదివారం ముసుగు వేశారు.

నేడు కోరుకొండలో పుష్పయాగం

కోరుకొండ, మార్చి 24: లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఆలయం వద్ద శ్రీ పుష్పయాగాన్ని (పవళింపు సేవ) నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆగమ పండితులు శాస్త్రోక్తంగా స్వామి వారికి ద్వాదశ ప్రదక్షిణలు, ఆరాధనలు అనంతరం పవళింపు సేవను వైభవంగా నిర్వహిస్తారు.

ముస్లింలకు అండగా ఉంటాం

ఇఫ్తార్ విందులో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24: ముస్లింలకు కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ వారికి అన్ని విధాలా అండగా తాముంటామని టీడీపీ, జనసేన నేతలు అన్నారు. స్థానిక దానవాయిపేట మదీనా షాదీఖానాలో ఆదివారం రాత్రి టీడీపీ పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహబూబ్ జానీ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన సిటీ ఇంచార్జి అత్తి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు స్వీకరించారు. నగరంలో షాదీఖానాలు అభివృద్ధి చేసింది టీడీపీ ప్రభుత్వమని గుర్తుచేశారు. రేపు కూటమి అధికారంలోకి వచ్చాక ముస్లింల సంక్షేమానికి పాటుపడతామని చెప్పారు. షాదీఖానాల అభివృద్ధి వెనుకబడిందని, తాము తెచ్చిన నిధులు జగన్ ప్రభుత్వం వల్ల వెనక్కిపోయాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య, మైనార్టీ నాయకులు ఖాన్ బాషా, బషీర్, అజీజ్, రఫిక్ రాజా, రబ్బానీ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



కొవ్వూరు, మార్చి 24: ఎటువంటి భయాందోళన చెందకుండా ప్రతిఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని సీఐ వి.జగదీశ్వర రావు అన్నారు. సార్వత్రిక ఎన్నికలపై అవగాహన కల్పిస్తూ కొవ్వూరు లోని శ్రీనివాసపురం, బ్రిడ్జిపేట, ఔరంగాబాద్‌లలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై సీఐ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు, ఎన్నికల సిబ్బందికి సహకరించాలన్నారు.

28న ఆర్టీసీ అన్ క్లెయిమ్డ్ పార్శిల్స్ వేలం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 24: రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని పార్శిల్ కార్యాలయం వద్ద ఈనెల 28వ తేదీన అన్ క్లెయిమ్డ్, అన్ ఐడెంటిఫైడ్ పార్శిల్స్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పదిన్నర గంటలకు పార్శిల్ బుకింగ్ ఆఫీస్ వద్ద వేలం నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ముగిసిన పాత సోమాలమ్మ జాతర



పూజల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 24: రాజమండ్రి గామ దేవత శ్రీ పాత సోమాలమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు సన్నాయి వాయిద్యాలు, కోలాటలతో ఆలయ ప్రాగణమంతా సందడిగా కనిపించింది. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కలెక్టర్ మాధవీలత కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. అలాగే మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, స్టేట్ బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వరరావు, బొల్లినేని కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజిస్టు డా.రామరాజు, రామదాసు శేషాద్రి రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైసీపీ పాలనంతా ఆక్రమణలు, దౌర్జన్యాలే

- టీడీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ
- తెలుగుదేశం పార్టీలో చేరిన 200 వైసీపీ కుటుంబాలు



టీడీపీలో చేరిన వారిని కండువా వేసి ఆహ్వానిస్తున్న నెహ్రూ

గోకవరం, మార్చి24: ఐదేళ్ల వైసీపీ పాలనంతా అక్రమాలు, ఆక్రమణలు, దౌర్జన్యాలేనని టీడీపీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ విమర్శించారు. గోకవరంలో వైసీపీకి చెందిన సుమారు 200 కుటుంబాలు టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గునుపే భరత్ ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ నెహ్రూ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో కంబాల మురళీ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో నెహ్రూ మాట్లాడుతూ మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. అడ్డగోలుగా దోచుకున్న జగన్మోహన్‌రెడ్డి కబంధహస్తాల నుంచి రాష్ట్రాన్ని రక్షించేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలిసి పని చేస్తోందన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మంగరౌతు రాము, పాలూరి బోస్, ఉంగరాల రాము, బత్తుల సత్తిబాబు, దాసరి తమ్మన్నదొర, గాజింగం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి ప్యాలెస్ నుంచే డ్రగ్ మాఫియా : వాసు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24: రాష్ట్రంలో జగన్ డ్రగ్ మాఫియా యువత భవితను చిదిమేస్తోందని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో నెం1 స్థానంలో ఉన్న ఏపీని జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గంజాయి, డ్రగ్స్ రవాణాలో నెం.1 స్థానానికి చేర్చాడని ఆరోపించారు. విశాఖను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తానని చెప్పి డ్రగ్ క్యాపిటల్‌గా మార్చాడని మండిపడ్డారు. గతంలో విజయవాడ ఆశీ ట్రేడర్స్ పేరుతో ముంద్రా పోర్టులో రూ.21 వేల కోట్లు విలువైన హెరాయిన్ దిగుమతిలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా డ్రైఈస్ట్ కలిపి రూ.50 వేల కోట్ల విలువైన 25 వేల కిలల్లో మార్ఫన్, కొకైన్ ,హెరాయిన్, యాంఫటేమిన్, మెస్కిలన్‌లు ఉన్నాయని సీబీఐ నివేదికలో తెలిపిందన్నారు. డ్రగ్స్ కుంభకోణం వెనుక తాడేపల్లి ప్యాలెస్ హస్తం ఉందన్నారు. జగన్‌రెడ్డికి సంబంధం లేకుండా ఎవరైనా ఇంత స్థాయిలో డ్రగ్స్ వ్యాపారం చేసే అవకాశం ఉందా అని ప్రశ్నించారు. ప్రగతి పథంలో చంద్రబాబు అభివృద్ధి చేసిన రాష్ట్రాన్ని ఈ దుర్మార్గ ముఖ్యమంత్రి జగన్ డ్రగ్స్‌కు క్యాపిటల్‌గా మార్చేసి పరువుతీశాడని ధ్వజమెత్తారు.

ల్యాండ్ టైటిలింగ్ పేరుతో మూకుమ్మడి హత్యలు : ఆదిరెడ్డి



ల్యాండ్ టైటిలింగ్ పేరుతో జగన్‌రెడ్డి మూకుమ్మడి హత్యలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. జగన్ రెడ్డి చట్టం వల్ల కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడమే అందుకు నిదర్శనమన్నారు. తమ ఆస్తి తమ పేరుతో రికార్డుల్లో లేకపోవడంతో ఆ కుటుంబం మొత్తం మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల స్థిరాస్తులను లాగేసుకునేందుకు జగన్‌రెడ్డి కుట్ర పన్నారనడానికి ఇంతకంటే సాక్ష్యం అవసరం లేదన్నారు. కడపలో జరిగిన కుటుంబ హత్యను ప్రజలందరు ఆలోచించుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని కోరారు.

ఘనంగా మట్టల ఆదివారం

- ఈతమట్టలతో ఊరేగిన సండేస్కూల్ చిన్నారులు
- పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



కడియం: దామిరెడ్డిపల్లిలో ఈత మట్టలతో ఊరేగుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24: రాజమహేంద్రవరంలో ఆదివారం వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఆరాధన అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలను పువ్వులతో అలంకరించి ఏసుక్రీస్తు ఆనాడు చాటిన శాంతి సందేశాన్ని తెలియజేస్తూ యువత, సంఘస్తులు ఊరేగింపులు నిర్వహించారు. వెంకటాపురంలోని సీయోను ప్రార్థన మందిరం పాస్టర్ పి.ఎర్నెస్ట్ మోజెస్, గారపాటి ఎలిజిబెత్, కవిత శాంతి సందేశాన్నిచ్చారు. కంబాలపేట హోలీ ట్రినిటీ ప్యారీస్ చర్చి ఆధ్వర్యంలో ఉసురుమర్తి ఆనంద్, సరోజనిరాస్ సంఘస్తులతో ఈతమట్టలతో ఊరేగింపు నిర్వహించారు.

కడియం: దామిరెడ్డిపల్లిలో బైబిల్‌మిషన్ మహిమ మందిరం పాస్టర్ రెవ. దేవరపల్లి రతన్‌రాజు ఆధ్వర్యంలో సండే స్కూల్ పిల్లలు, సంఘస్థులు ఈత మట్టలను పట్టుకుని సంకీర్తనలు చేస్తూ గ్రామంలో తిరిగారు. కార్యక్రమంలో సరోజిని, దేవరపల్లి ఫ్రాన్సిస్, కళ్యాణి ఫ్రాన్సిస్, కొండేటి ప్రసాద్, పందిరి రాజు, పాదూరి ప్రవీణ్, బొర్రా వివేక్ పాల్గొన్నారు.



రంగంపేటలో ఈత మట్టలతో ఊరేగుతున్న సండేస్కూల్ పిల్లలు

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో సెయింట్ థామస్ లూథరన్ చర్చి రెవరెండ్ జి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పువ్వులతో అలంకరించిన ఈత మట్టలతో చిన్నారులు ర్యాలీ జరిపారు. యేసుక్రీస్తు యెరుసలేంలోకి విజయవంతంగా ప్రవేశించిన రోజును మట్టల ఆదివారంగా జరుపుకుంటారని, ఈస్టర్ ముందు వచ్చే ఆదివారం ఈ వేడుక జరుపుకుంటారని ఆయన చెప్పారు.

రంగంపేట: మండలంలోని వడిశలేరులో లూథరన్ చర్చి చిన్నారులు ఈత మట్టలతో యేసుక్రీస్తుకు జయము జయమంటూ నినాదాలు చేస్తూ గ్రామం లో ర్యాలీ నిర్వహించారు. చర్చి ఫాదర్ భక్తులకు సందేశాన్ని అందించారు. అలాగే రంగంపేట, సింగంపల్లి, ఎస్టీ రాజాపురం, మర్రిపూడి, జి.దొంతమూరు, పెదరాయవరం, కోటపాడు, ఈలకొలను గ్రామాల్లో క్రైస్తవులు ఘనంగా మట్టల ఆదివారం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యత పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి

ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు

రాజానగరం, మార్చి 24: నాణ్యత పాటించని వాటర్ ప్లాంట్లను మూసివేసే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ తాగునీటి విక్రయాల ప్లాంట్లు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొచ్చాయని, నీళ్ల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రజలకు తాగునీటి అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చలేకపోవడం వల్ల ప్రజలు తమ ఆరోగ్యం కాపాడుకోవడం కోసం ఎక్కువగా మినరల్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడుతున్నారన్నారు. దీనిని అదునుగా తీసుకుని కొంతమంది వ్యాపారులు యథేచ్ఛగా నీటిని అమ్ముకుంటూ లాభాలు గడిస్తున్నారన్నారు. నాణ్యతలేని నీళ్ల తాగిన ప్రజలు రోగాల బారినపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే నాణ్యతా ప్రమాణాలు పాటించని వాటర్ ప్లాంట్‌లను మూసివేయాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఘనంగా మదుగులమ్మ జాతర



బిక్కవోలు, మార్చి 24: బిక్కవోలు గ్రామ దేవత మదుగులమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్ని చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి అమ్మవార్ని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు నందిపాటి సత్తిరెడ్డి మాట్లాడుతూ పదేళ్లుగా మాజీ ఏఎంసీ చైర్మన్ జేవీవీ. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 31న అమ్మవారికి ప్రీతికరమైన మాంసాహారంతో మహాన్నదానం నిర్వహించనున్నట్టు చెప్పారు.

బాధిత కుటుంబానికి ఉపకరణాలు అందజేత

రంగంపేట, మార్చి 24: మండలంలోని సింగంపల్లిలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆదివారం ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు సహకారంతో ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు మంచం, వంట పాత్రలు, బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగంపల్లిలో అగ్నిప్రమాదంలో రమాదేవికి చెందిన తాటాకిల్లు దగ్ధమై కుటుంబం సర్వం కోల్పోయి రోడ్డున పడిందని, ప్రమాదం జరిగి 8 రోజు లైనా నేటికి సంబంధిత అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ నాయకులు దేశెట్టి సురేష్, డాన్ శీను, వీరన్న, పడాల శ్రీను, కన్నబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

గోదావరి మాతకు మహా నీరాజనం



గోదావరిమాతకు హారతి ఇస్తున్న పండితులు

కొవ్వూరు, మార్చి 24: ఫాల్గుణ పూర్ణిమ సందర్భంగా ఆదివారం ప్రదోషకాలంలో అఖండ గోదావరిమాతకు మహా నీరాజనం అందజేశారు. కొవ్వూరు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలోని గోదావరిమాతకు నీరాజన సమితి ఆధ్వర్యంలో 222వ మాసోత్సవ మహా నీరాజనం, మహిళలతో దీపోత్సవం నిర్వహించారు. గంప కృష్ణారావు, భాస్కరదేవి, అత్తిలి చల్లారావు, నాగదేవి దంపతులు పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇనుగంటి ఉమారామారావు, రాయప్రోలు కామేశ్వరశర్మ, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీలకు అండగా జనసేన : దుర్గేష్



నిడదవోలులో జనసేనలో చేరిన వెంకటేశ్వర జట్టు సంఘంతో దుర్గేష్

పెరవలి/నిడదవోలు, మా ర్చి 24: బీసీ, ఎస్సీలకు జనసేన ఎల్లపుడూ అండగా ఉంటుం దని ఉమ్మడి అభ్యర్థిగా నియో జకవర్గంలో అందరికీ అందుబాటులో ఉంటానని జనసేన- టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి మండలంలోని తీపర్రు, కాకరపర్రు, పెరవలి గ్రామాల్లోని బీసీ, ఎస్సీలకు చెందిన పలువురు కార్యకర్తలు, వెంకటేశ్వర జట్టు సంఘం, పలువురు యువ కులు ఆదివారం నిడదవోలులోని జనసేన పార్టీలో చేరారు. వారికి దుర్గేష్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ, ఎస్సీలు అందరూ తమకు అండగా నిలబడాలన్నారు. కార్యక ర్తలంతా సైనికుల్లా చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. జనసేనలో చేరిన వారిలో మల్లుల నాని, పంపన సూరన్న, కుక్కల పవన్, కృష్ణ, సొంగ చిన్న, మంగన్న, నేకూరి రాంబాబు ఉన్నారు. కార్యక్రమాల్లో జనసేన పట్టణాధ్యక్షుడు రంగా రమేష్, మండలాధ్యక్షుడు పిప్పర రవి, పత్తిపాటి ప్రసాద్, సంగీత నాగు, నందిప చక్రవర్తి, వీరవల్లి శ్రీను, పాలా వీరాస్వామి, గుడాల రంగ తదితరులు పాల్గొన్నారు.

దాడి చిత్రం పోస్టర్ ఆవిష్కరణ

కథానాయకుడు, దర్శకత్వం కంబాల శ్రీనివాసరావు



దాడి చిత్రం పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

గోకవరం, మార్చి 24: ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, హిందూ మతంపై జరుగుతున్న దాడులు, హిందూవుల దీనస్థితి తదితర అంశాలను వివరిస్తూ దాడి అనే చిత్రాన్ని నిర్మించినట్టు హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. గోకవరంలోని సీఎండీ కేఎస్‌పీవీ లేఅవుట్ ప్రాంగణంలో ఆ చిత్రం పోస్టర్‌ను ఆదివారం టీడీపీ నాయకుడు దాసరి తమ్మన్నదొర చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర దర్శకుడు, కథానాయకుడు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూత్వంపై జరుగుతున్న దాడులను, జరగబోయే పరిణామాలు వివరిస్తూ డాక్యుమెంటరీ రూపంలో దాడి చిత్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈచిత్రం టీజర్, ట్రైలర్‌ను త్వరలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా విడుదల చేసేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనగోటి దొర, వల్లూరి జగన్నాథశర్మ, వరసాల ప్రసాద్, వివిధ పార్టీ నాయకులు సత్తి వెంకటరెడ్డి, ఉంగరాల ఆదివిష్ణు, దాసరి తరుణ్, కట్టా కళ్యాణ్, పదిలం మురళి, మిరియాల గాంధీ, ప్రగడ ప్రభ, దోసపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ ఆలయ వార్షికోత్సం

కడియం, మార్చి 24: మండలంలోని వేమగిరి సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి, ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, పితాని శివరామకృష్ణ, వాశంశెట్టి నాగబాబు, గుత్తుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురమండలో సోమేశ్వరస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న యువకులు

కడియం, మార్చి 24: మండలంలోని మురమండలో సర్వకామదాంబ సోమేశ్వరస్వామి పాంచాహ్నిక కల్యాణోత్సవం సందర్భంగా ఆదివారం స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామి వారు రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువత, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజ సంగీతోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 24: త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత వార్షికో త్సవాలు ఆదివారం ఆరవ రోజు కొనసాగాయి. మహారాజ స్వాతి తిరునాళ్ (ట్రావెన్‌కోర్) వారసుడు ప్రిన్స్ రామవర్మ గాత్రం, ఎస్.ఆర్.విను (త్రివేండ్రం) వయోలిన్,బి.హరికుమార్ (చెన్నై) (మృదంగం),బుద్ధవరపు మారుతీ రఘురామ్(తిరుపతి)(ఘటం) చేసిన సంగీత కచేరీ సంగీతప్రియులను అలరించింది. సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఘనంగా అఖండ హరినామ సంకీర్తన

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24: రాజమహేంద్రవరం ఆర్యాపురం కృష్ణ చైతన్య ఆశ్రమంలో ఆదివారం అఖండహరినామ సంకీర్తన నిర్వహించారు. భక్తి వైభవ్ పూరి గోస్వామి మహరాజ్ వారి దివ్య ఆశీస్సులతో గోదావరి ఉత్కల్ సేవా సహకారంతో ఉదయం 7 గంటల నుంచి సంకీర్తన సాగింది. శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి పర్యవేక్షించారు.

ఇఫ్తార్ విందులో గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24: రాజమహేంద్రవరం దానవాయిపేట మసీదులో ఆదివారం సాయంత్రం మహబూబ్ జానీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. టీడీపీ సీనియర్ నేత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు.

క్వారీ లారీల కార్మికుల నిరవధిక సమ్మె



దేవరపల్లి, మార్చి 24: దుద్దుకూరులో క్వారీ లారీల కార్మికులు నూతన వేతన ఒప్పందం కోసం నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నామని వివిధ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కే.మస్తాన్, ఏ.ఏడుకొండలు అన్నారు. దుద్దుకూరులో నూతన వేతన ఒప్పందం విఫలం అవడంతో ఆదివారం ఆందోళన, వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల నూనత వేతన ఒప్పందం కోసం యజమానులకు నోటీసులు ఇచ్చామని వారితో జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మె బాటపట్టామన్నారు. వేతన ఒప్పందం కుదిరే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలు, లారీ వర్కర్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, బాచి, మల్లిపూడి రామకృష్ణ, ఉండ్రాజవరపు రాజు, కార్తీక్, పాల్గొన్నారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి



కొవ్వూరులో కవాతు నిర్వహిస్తున్న జవాన్లు

కొవ్వూరు, మార్చి 24: ఎటువంటి భయాందోళన చెందకుండా ప్రతిఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని సీఐ వి.జగదీశ్వరరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికలపై అవగాహన కల్పిస్తూ కొవ్వూరులోని శ్రీనివాసపురం, బ్రిడ్జిపేట, ఔరంగాబాద్‌లలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై సీఐ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు, ఎన్నికల సిబ్బందికి సహకరించాలన్నారు.

బాలుడికి 'మానవత' ఆర్థిక సాయం

నిడదవోలు, మార్చి 24: మండలంలోని కంసాలిపాలెం గ్రామానికి చెందిన చదలవాడ మోహన్ కుమారుడు విహాన్ అనారోగ్య బారిన పడడంతో బాలుడికి ఆదివారం మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ డైరెక్టర్ సుంకవల్లి రామారావు, ముళ్ళపూడి కృష్ణారావు, నిడదవోలు శాఖ కలిపి రూ.25,000 అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కాజా గంగరాజు, ముళ్ళపూడి కేశవరావు, తన్నీడి బోసు, కొప్పుల వెంకటేశ్వరరావు తదితర్లు పాల్గొన్నారు.

గోదావరి మాతకు మహా నీరాజనం



గోదావరిమాతకు హారతి ఇస్తున్న పండితులు

కొవ్వూరు, మార్చి 24: ఫాల్గుణ పూర్ణిమ సందర్భంగా ఆదివారం ప్రదోషకాలంలో అఖండ గోదావరిమాతకు మహా నీరాజనం అందజేశారు. కొవ్వూరు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలోని గోదావరిమాతకు నీరాజన సమితి ఆధ్వర్యంలో 222వ మాసోత్సవ మహా నీరాజనం, మహిళలతో దీపోత్సవం నిర్వహించారు. గంప కృష్ణారావు, భాస్కరదేవి, అత్తిలి చల్లారావు, నాగదేవి దంపతులు పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇనుగంటి ఉమారామారావు, రాయప్రోలు కామేశ్వరశర్మ, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రా గీర్వాణ విద్యాపీఠానికి విరాళం

కొవ్వూరు, మార్చి 24: కొవ్వూరు ఆంధ్రా గీర్వాణ విద్యాపీఠం వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం తల్లాప్రగడ విశ్వేశ్వర రామం శత జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ నెల 22నుంచి 24వరకు నిర్వహించిన ఉత్సవాల సందర్భంగా విశ్వేశ్వరరామం కుటుంబ సభ్యులు తల్లాప్రగడ సుబ్బారావు, శ్రీరామచంద్రరావులు కళాశాల అభివృద్ధికి రూ.2 లక్షలు విరాళం అందజేశారు. అలాగే అంతర్జాలంలో గాని, ప్రత్యక్షంగా గాని సంస్కృత భాషను నేర్చుకోవడానికి కళాశాలలో ఒక విద్యా కేంద్రం ఏర్పాటుచేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో విద్యాపీఠం అధ్యక్షుడు వాడ్రేవు వేణుగోపాలరావు, వాడ్రేవు మల్లపురాజు, దోర్బల ప్రభాకరశర్మ, జీబీవీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో నల్లజర్ల హైస్కూల్ 1995 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

నల్లజర్ల, మార్చి 24: నల్లజర్ల హైస్కూల్లో 1995 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. హైదరాబాద్‌లో స్థిరపడిన విద్యార్థిని తాండ్ర శైలజ అయ్యవరంలోని తన వ్యవసాయ క్షేత్రంలో సమ్మేళనం నిర్వహించారు. వారు ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి అల్లరి చేష్టలను తలంచుకుని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన శ్రీరామూర్తి, దత్తు, అప్పారావు, చంద్రరావులను ఘనంగా సత్కరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ప్రేమ విందు చేశారు. కార్యక్రమంలో గుదే సుబ్బారావు, నిమ్మలపూడి ప్రసాద్, పాతూరి రవి, ఏర్రా సాయిబాబు, పోతల రవికుమార్, రావూరి వెంకటరమణ దంపతులు పాల్గొన్నారు.

ముగ్గురు వైద్య ఉద్యోగులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న ఎంఎల్‌హెచ్‌పీ షేక్ జరీనా

నల్లజర్ల, మార్చి 24: టీబీ అంతమే మా పంతం అని ప్రతిజ్ఞ చేసి మరీ పోరాడుతున్న నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్య ఉద్యోగులు ముగ్గురు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన వేడుకల్లో దూబచర్ల ఎంఎల్‌హెచ్‌పీ షేక్ జరీనా, ఆశావర్కర్ తాడినాడ అనంతలక్ష్మి, నల్లజర్ల ఆరోగ్య కార్యకర్త తోర్లకుంట రత్నకుమారి అవార్డు అందుకున్నారు. జిల్లాలో నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలోనే మూడు అవార్డులు రావడం ఆనందదాయకమని డాక్టర్ తెల్లం గంగాధర్, వైద్యాధికారి జీవీవీ ప్రసాద్ అన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

కొవ్వూరు, మార్చి 24: యువతిని అపహరించిన యువకుడిపై పోక్సో కేసున మోదు చేసినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. తమ కుమార్తె కనిపించడం లేదని 2024 జనవరి 31న స్థానిక పోలీసుస్టేషన్‌లో కొవ్వూరుకు చెందిన మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసునమోదు చేశారు. ఆదివారం యువతి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసుమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

క్వారీ లారీ కార్మికుల నిరవధిక సమ్మె



దేవరపల్లి, మార్చి 24: దుద్దుకూరులో క్వారీ లారీల కార్మికులు నూతన వేతన ఒప్పందం కోసం నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నామని వివిధ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కే.మస్తాన్, ఏ.ఏడుకొండలు అన్నారు. దుద్దుకూరులో నూతన వేతన ఒప్పందం విఫలం అవడంతో ఆదివారం ఆందోళన, వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల నూనత వేతన ఒప్పందం కోసం యజమానులకు నోటీసులు ఇచ్చామని వారితో జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మె బాటపట్టామన్నారు. వేతన ఒప్పందం కుదిరే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలు, లారీ వర్కర్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, బాచి, మల్లిపూడి రామకృష్ణ, ఉండ్రాజవరపు రాజు, కార్తీక్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా పూజలు

దేవరపల్లి, మార్చి 24: మండలంలోని యర్నగూడెంలో శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మంది దంపతులు పూజా కార్యక్రమాలు, హోమాల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణకర్త శ్రీకాకుళపు కాశీవిశ్వనాథం, రోహిణి దంపతులు బలిదాన, పూజ నిర్వహించారు. నిర్వాహకుడు, సిద్ధాంతి రావిపాటి వరప్రసాద్, ఆలయ నిర్మాణకర్త శ్రీకాకుళపు కాశీవిశ్వనాథం దంపతులు, భక్తుల సమూహంతో విగ్రహాలను గర్భాలయంలో చేర్చారు. సాయంత్రం గ్రామోత్సం, మహాశాంతి కుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు రెండు వాహనాలకు వేలం

కొవ్వూరు, మార్చి 24: కొవ్వూరు ఎస్ఈబీ సీఐ కార్యాలయంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన రెండు హోండా యాక్టివా వాహనాలకు ఈ నెల 26న వేలం నిర్వహిస్తున్నట్టు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. వేలంలో పాల్గొనే అభ్యర్థులు ఆధార్‌కార్డుతో పాటు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. పాటలో వాహనాలు దక్కించుకున్న వారు 18శాతం జీఎస్టీ చెల్లించాలన్నారు.

జగన్ పాలనలో బలహీన వర్గాలపై దాడులు

టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి

కొవ్వూరు, మార్చి 24: జగన్మోహనరెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఎస్సీ బీసీ, మైనార్టీలపై దాడులకు పాల్పడి, హత్యలు చేస్తున్నారని టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఇళ్లస్థలాల విషయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు ఏం చేశారో అందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం, గనులు మాఫియా విచ్చలవిడిగా సాగుతుందన్నారు. వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో ఒక్క బోరు గాని, వాటర్‌ట్యాంకు గాని నిర్మించలేదన్నారు. ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ అమలుచేయలేదన్నారు. మెగా డీఎస్సీ అని దగా చేశారన్నారు. ఉద్యోగాలు లేక యువత తీవ్ర నిరుద్యోగాన్ని ఎదుర్కొంటుందన్నారు. మంత్రులుగా పనిచేసిన బీసీ నేతలు అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, కొల్లు రవీంద్రలను అక్రమ అరెస్టులు చేసి బీసీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. టీడీపీ బడుగు బలహీనవర్గాలు, దళితులు, బీసీల కోసమే పనిచేస్తోందని, రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించడానికి వారంతా సిద్ధంగా ఉన్నారన్నారు. పేదల భూములను కొట్టేయడానికే జీవో 512 పేరుతో ల్యాండ్ టైట్లింగ్ యాక్టును తీసుకువచ్చారన్నారు. దీనికి తాజా ఉదాహరణగా ఒంటిమిట్ట మండలంలో చేనేత కార్మికుని కుటుంబం ఆత్మహత్య నిలుస్తుందన్నారు. వైజాగ్‌లో డ్రగ్స్ వ్యాపారం వెనుక విజయసాయిరెడ్డి పాత్ర ఉందన్నారు. డ్రగ్స్ వ్యాపారం వెనుక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విజయసాయిరెడ్డి, జగన్మోహనరెడ్డి అనుచరులు ఉన్నారని తేటతెల్లమైందని, వారందరిపై సీబీఐ దర్యాప్తు జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదని, తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరు మండలం పెనకనమెట్ట, ధర్మవరం గ్రామాల్లో టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, దాయన రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, రాజాన శ్రీనివాస్ వట్టికూటి వెంకటేశ్వరరావు, శ్రీను, విజయకుమార్, గారపాటి వెంకట కృష్ణ, నేరేడుమిల్లి నాగమణి, నరేంద్ర, యోగేంద్రకుమార్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

సైకో పాలనను సాగనంపాలి

చాగల్లు, మార్చి 24: చాగల్లులో జరిగిన ముప్పిడి వెంకటేశ్వరరావు పరిచయ కార్యక్రమంలో మిత్రపక్షాల నాయకులు పలువురు మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్ కోసం సైకో పాలనను సాగనంపాలని, ప్రతిఒక్కరూ సమష్టిగా కృషి చేసి ముప్పిడిని గెలిపించుకుందామన్నారు. ముప్పిడి మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ మాఫియా నుంచి రక్షించుకోవాలని, అందుకు ఈ దుర్మార్గపు వైసీపీ పాలన అంతం కావాలన్నారు. అందరికి అందుబాటులో ఉండి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, నాదెళ్ళ శ్రీరామ్, రామకృష్ణ, జొన్నకూటి వెంకాయమ్మ, జనసేన నాయకులు రామాంజనేయులు, కొప్పాక విజయకుమార్, బీజేపీ నాయకులు తాళ్ళూరి వరప్రసాద్, కంచుమర్తి సుబ్బారావు, కె.జగన్ పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీలకు అండగా జనసేన : దుర్గేష్



నిడదవోలులో జనసేనలో చేరిన వెంకటేశ్వర జట్టు సంఘంతో దుర్గేష్

పెరవలి/నిడదవోలు, మార్చి 24: బీసీ, ఎస్సీలకు జనసేన ఎల్లపుడూ అండగా ఉంటుందని ఉమ్మడి అభ్యర్థిగా నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉంటానని జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి మండలంలోని తీపర్రు, కాకరపర్రు, పెరవలి గ్రామాల్లోని బీసీ, ఎస్సీలకు చెందిన పలువురు కార్యకర్తలు, వెంకటేశ్వర జట్టు సంఘం, పలువురు యువకులు ఆదివారం నిడదవోలులోని జనసేన పార్టీలో చేరారు. వారికి దుర్గేష్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ, ఎస్సీలు అందరూ తమకు అండగా నిలబడాలన్నారు. కార్యకర్తలంతా సైనికుల్లా చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. జనసేనలో చేరిన వారిలో మల్లుల నాని, పంపన సూరన్న, కుక్కల పవన్, కృష్ణ, సొంగ చిన్న, మంగన్న, నేకూరి రాంబాబు ఉన్నారు. కార్యక్రమాల్లో జనసేన పట్టణాధ్యక్షుడు రంగా రమేష్, మండలాధ్యక్షుడు పిప్పర రవి, పత్తిపాటి ప్రసాద్, సంగీత నాగు, నందిప చక్రవర్తి, వీరవల్లి శ్రీను, పాలా వీరాస్వామి, గుడాల రంగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

కొవ్వూరు, మార్చి 24: కొవ్వూరు పట్టణ, మండలంలో మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. పువ్వులతో అలంకరించిన ఈతమట్టలతో క్రీస్తు గీతాలాపాన చేస్తు పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సువార్త ప్రకటించారు. ఈ సందర్భంగా కొవ్వూరులోని నాలుగో వార్డు సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ గెల్లా రాజన్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ఉండ్రాజవరం లూథరన్ చర్చి వద్ద ఈత మట్టలతో చిన్నారులు



చాగల్లులో ఊరేగింపు నిర్వహిస్తున్న సన్‌డే స్కూల్ చిన్నారులు

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో చర్చిల వద్ద ఈత మట్టలను పూలతో అలంకరించారు. యేసుక్రీస్తు యెరూషలేము వీధుల్లో వెళ్ల సందర్భంలో జరిగే సంఘటనలను పాస్టర్లు బోధించారు. ప్రత్యేక గీతాలను ఆలపించారు. ఉండ్రాజవరంలోని లూథరన్ చర్చిలో చిన్నారులతో ఈతమట్టలతో ర్యాలీ చేశారు. ఆర్‌సీఎం, పెంతుకొస్తు, బైబిల్ మిషన్, జీడీఎం, క్రీస్తు సంఘం తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చాగల్లు: చాగల్లులో సెయింట్ మార్కు బైబిల్ బిషన్ చర్చి ఆధ్వర్యంలో సన్‌డే స్కూల్ చిన్నారులు ఈత మట్టలను చేతబట్టుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మేరీమాత మహోత్సవాలు

దేవరపల్లి, మార్చి 24: నిర్మలగిరి మేరీమాత మహోత్సవాలు 3వ రోజైన ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు మేరీ మాతను దర్శించుకున్నారు. వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి మేరీమాతను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మెట్ల మార్గం ద్వారా ప్రధాన ఆలయానికి మోకాళ్లపై ఎక్కి ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే తల నీలాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. మేరీమాత స్వరూపం వద్ద కొబ్బరికాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ పాదర్ జాన్‌పీటర్ భక్తులకు ఆశీర్వాచనాలు అందజేశారు. దివ్యబలి పూజలు, పవిత్రాత్మ స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు.



గౌరీపట్నంలో మోకాళ్లపై మెట్లెక్కుతున్న భక్తులు



విద్యుత్ కాంతుల వెలుగులో నిర్మలగిరి మేరీమాత ఆలయ ప్రాంగణం

వైభవంగా చక్రతీర్థం

కోరుకొండలో ముగిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

కోరుకొండ, మార్చి 24: కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం దేవుని కోనేటి వద్ద చక్ర పెరుమాళ్లకు నరసింహస్వామి, అనంత పద్మనాభస్వామి సమక్షంలో చక్రతీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యుల బ్రహ్మత్వంలో అనువంశక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ పర్యవేక్షణలో ఆలయ అనువంశిక అర్చకస్వాములు, చక్రపెరుమాళ్ళకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అంతకుముందు స్వామి దిగువ దేవస్థానంలో ప్రత్యేక సేవాకాలం నిర్వహించి నరసింహ, పద్మనాభ స్వాములను చెరో పల్లకిలో ఆశీనులు చేసి మేళతాళాలు, మంత్రోచ్చారణలతో దేవుని కోనేటి వద్దకు తొడ్కొచ్చారు. అనంతరం అక్కడ చక్రపెరుమాళ్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి కోనేటిలో చక్రతీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు చక్రస్నానాలు ఆచరించారు. తదుపరి స్వామివార్లు ఆలయానికి చేరుకున్నారు.



దేవుని కోనేరు వద్ద చక్రస్నానం దృశ్యం

శేషవాహన సేవ.. లక్ష్మీనరసింహస్వామికి కోరుకొండ నాలుగు మాడవీధుల్లో శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు స్వామి వారిని చివరిసారిగా దర్శించుకుని మంగళనీరాజనాలు అందజేశారు.

ధ్వజావరోహణం.. ముగిసిన బ్రహ్మోత్సవాలు

నరసింహస్వామి కల్యాణోత్సవాలు(బ్రహ్మోత్సవాలు) ఆదివారం అర్ధరాత్రితో వైభవంగా ముగిశాయి. అంతకుముందు స్వామి వారి ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. మొదటిరోజు కుంకురార్పణతో ప్రారంభమైన ధ్వజ ఆరోహణం చివరి ధ్వజాన్ని అవరోహణం చేయడం ద్వారా ఉత్సవాలు శాస్త్రోక్తంగా పరిసమాప్తమయ్యాయి.



శేష వాహనంపై నరసన్న

వైభవంగా నరసన్న ఊయల సేవ

నరసన్న కల్యాణోత్సవాలు చివరి రోజు ఆదివారం రాత్రి స్వామివారి ఆలయ మండపంలో ప్రత్యేక ఊంజలసేవ(ఊయల సేవ)నిర్వహించారు. ఇందుకోసం స్వామి కల్యాణ మండపాన్ని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. కల్యాణ వేదికపై ఊయాలలో ఆశీనులైన నరసింహ స్వామిని ఎదురుగా ఉన్న పెద్ద అద్దంలో భక్తులు దర్శించుకున్నారు.

నేడు శ్రీ పుష్పయాగం

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారి ఆలయం వద్ద శ్రీ పుష్పయాగాన్ని(పవళింపు సేవ) నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆగమ పండితులు శాస్త్రోక్తంగా స్వామి వారికి ద్వాదశ ప్రదక్షిణలు, ఆరాధనలు అనంతరం పవళింపు సేవను వైభవంగా నిర్వహిస్తారు.

ముగిసిన పండిత సభలు

నరసన్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో ఐదు రోజులుగా సాగుతున్న92వ పండిత సభలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఎందరో పండితులు ఈ ఆధ్యాత్మిక సభల్లో పాల్గొని భారత, భగవత, రామాయణ, ఇతిహాసాల్లోని అనేక విషయాలను, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఆళ్వారులు ప్రబంధంలోని అనేక భగవత్ విషయాలను వివరించారు. ముగింపు సందర్భంగా సభల్లో పాల్గొన్న పండితులందరినీ ఘనంగా సత్కరించారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా కోరుకొండకు వచ్చిన భక్తులకు స్థానిక మిరియాల వెంటరెడ్డి పంతులు ధర్మసత్రంలో ఉచిత నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు సెలవు దినం(ఆదివారం) కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్ని అన్నప్రసాదాలు స్వీకరించారు. సుమారు 50వేల మందికి పైగా అన్నప్రసాదం అందించినట్టు సత్రం ఈవో పాటి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమాల్లో జరిగింది.ఈ గ్రామోత్సవంలో పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రంగరాజభట్టర్, పరాసర రఘునాథ భట్టర్, పెద్దింటి,పెరవళి, పెదపాటి అనువంశక అర్చక స్వాములు పాల్గొన్నారు.



నరసింహుడి కల్యాణ మండపంలో ఊయల సేవ

భార్య ఎడబాటును తట్టుకోలేక ఆత్మహత్య

వాటర్ ట్యాంక్ పైనుంచి దూకి భర్త అఘాయిత్యం

అనపర్తి, మార్చి 24: భార్య ఎడబాటును తట్టుకోలేక అనపర్తి మండలం కుతుకులూరులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రామారావు వివరాల ప్రకారం కుతుకులూరులోని కూటేశ్వర కాలనీకి చెందిన మండ వీర వెంకట సత్యనారాయణరెడ్డి(38)కి 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. సత్యనారాయణరెడ్డి తన తల్లి వద్ద ఉంటున్నాడు. భార్య ఎడబాటును తట్టుకోలేని ఆయన ఆదివారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

అత్తపై అల్లుడి దాడి

కూతురు, మనవలను తీసుకెళ్లమనడంతో ఘర్షణ





తలపై అయిన బలమైన గాయాలు, ఉంగరం వేలు చివరి భాగం

బిక్కవోలు, మార్చి 24: తన కూతురు, మనవలను తీసుకెళ్లమనడంతో అత్తపై అల్లుడు దాడి చేసిన సంఘటన బిక్కవోలు మండలం ఇళ్లపల్లిపాకలు గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ పి.బుజ్జిబాబు వివరాల ప్రకారం.. యానాంకు చెందిన గీసాల దుర్గామోహన్‌కు 2013లో ఇళ్లపల్లిపాకలుకు చెందిన వాసంశెట్టి లోవకుమారితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. మోహన్ తరచూ మద్యం తాగొచ్చి భార్యను కొడుతుండడంతో ఆమె అమ్మగారి ఇంటి వద్దకు వచ్చేసింది. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు కోర్టు పరిధిలో ఉంది. ఆదివారం ఇళ్లపల్లిపాకలు వచ్చిన మోహన్‌ను తన కూతురు, మనవలను ఎందుకు తీసుకు వెళ్లడంలేదంటూ అత్త మంగ నిలదీసింది. దీంతో మాటా, మాటా పెరిగి గొడవ పడి అక్కడ వున్న కత్తిపీటతో మంగ తలపై దాడి చేశాడు. ఆమె చెయ్యి అడ్డుపెట్టుకోవడంతో ఆమె కుడి చేయి ఉంగరం వేలు చివరి భాగం, తలపై బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆమెను స్థానికులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

దాడి చిత్రం పోస్టర్ ఆవిష్కరణ

కథానాయకుడు, దర్శకుడు కంబాల శ్రీనివాసరావు



దాడి చిత్రం పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

గోకవరం, మార్చి 24: ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, హిందూ మతంపై జరుగుతున్న దాడులు, హిందూవుల దీనస్థితి తదితర అంశాలను వివరిస్తూ దాడి అనే చిత్రాన్ని నిర్మించినట్టు హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. గోకవరంలోని సీఎండీ కేఎస్‌పీవీ లేఅవుట్ ప్రాంగణంలో ఆ చిత్రం పోస్టర్‌ను ఆదివారం టీడీపీ నాయకుడు దాసరి తమ్మన్నదొర చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర దర్శకుడు, కథానాయకుడు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూత్వంపై జరుగుతున్న దాడులను, జరగబోయే పరిణామాలు వివరిస్తూ డాక్యుమెంటరీ రూపంలో దాడి చిత్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈచిత్రం టీజర్, ట్రైలర్‌ను త్వరలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా విడుదల చేసేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనగోటి దొర, వల్లూరి జగన్నాధశర్మ, వరసాల ప్రసాద్, వివిధ పార్టీ నాయకులు సత్తి వెంకటరెడ్డి, ఉంగరాల ఆదివిష్ణు, దాసరి తరుణ్, కట్టా కళ్యాణ్, పదిలం మురళి, మిరియాల గాంధీ, ప్రగడ ప్రభ, దోసపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

ముగిసిన పాత సోమాలమ్మ జాతర



పూజల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 24: రాజమండ్రి గామ దేవత శ్రీ పాత సోమాలమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు సన్నాయి వాయిద్యాలు, కోలాటలతో ఆలయ ప్రాగణమంతా సందడిగా కనిపించింది. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కలెక్టర్ మాధవీలత కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. అలాగే మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, స్టేట్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వరరావు, బొల్లినేని కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజిస్టు డా.రామరాజు, రామదాసు శేషాద్రి రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇఫ్తార్ విందులో గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24: రాజమహేంద్రవరం దానవాయిపేట మసీదులో ఆదివారం సాయంత్రం మహబూబ్ జానీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. టీడీపీ సీనియర్ నేత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	కుంగ్‌పూ పాండా..
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	భీమా
నిడదవోలు	
వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	ఓం బీం బుష్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి


ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 25 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	సా.6.24
సహారి(మంగళ)	ఉ.4.42

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	38.0	23.0



జన..నిర్మలగిరి

దేవరపల్లి మండలం నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు..మోకాళ్ల మెట్లు ఎక్కి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తలనీలాలు ఇచ్చారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందూ సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. ఎక్కడెక్కడి నుంచో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కొండంతా జనంతో నిండిపోయింది. విద్యుద్దీపాలతో నిర్మలగిరి కొండంతా వెలిగిపోయింది. -8లో

18 మందితో జనసేన జాబితా
కందుల దుర్గేష్, బత్తుల బలరామకృష్ణ పేర్లు ధ్రువీకరణ

రాజమహేంద్రవరం, మార్చి24(ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాత కొత్త 18 మంది అభ్యర్థులతో ఆదివారం రాత్రి జాబితా విడుదల చేశారు.జిల్లాలో ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థులను మళ్లీ అధికారికంగా ధ్రువీకరించించారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు నేపథ్యంలో ఇతర జిల్లాల్లో కొన్ని చోట్ల ప్రకటించిన అభ్యర్థులను కూడా మార్చిన నేపథ్యంలో అధికారికంగా జాబితా విడుదల చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లాలో కందుల దుర్గేష్(నిడదవోలు), బత్తుల బలరామకృష్ణ (రాజానగరం)ఉన్నారు.వీరిని గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే.

కోట సత్తెమ్మకు కోటి దండాలు



నిడదవోలు, మార్చి 24 : కోట సత్తెమ్మకు కోటి దండాలు అంటూ అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున కొలిచారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది.పెద్ద ఎత్తున హాజరైన భక్తజనం అమ్మవారికి విశేష పూజలు చేశా రు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,21,984 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దాలి
- క్షయ నివారణాధికారిణి డాక్టర్ వసుంధర

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 24 : జిల్లాను క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నివారణాధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర అన్నారు. ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాజమహేంద్రవరం జిల్లా క్షయ నివారణ కార్యాలయంలో క్షయ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 109 పంచాయతీలు టీబీ ముక్త పంచాయతీలుగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. జిల్లాలో 2023లో 51,668 టీబీ కఫం పరీక్షలు నిర్వహించగా 2946 కేసులు నమోదైనట్టు తెలిపారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే నివారణ సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఇతర వైద్యసిబ్బంది, నర్సింగ్ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.



కోకో.. ధర బాగు

పెరవలి,మార్చి 24 : కోకో గింజలు ధర గోగో అంటుంది.. రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం కేజీ గింజల ధర రూ.650 నుంచి రూ.700 వరకు పలుకుతుంది.గతేడాది ఇదే రోజుల్లో కేజీ గింజలు ధర రూ.200 నుంచి రూ.240 మాత్రమే పలికింది. ఈ ఏడాది జనవరి నెల నుంచి క్రమ క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం రూ.700లకు చేరుకోవడంతో కోకో రైతుల్లో ఆనందం నెలకొంది. ఈ ఏడాది కోకో కాయలు కాపు తక్కువగా ఉండడం వల్లే కంపెనీల మధ్య పోటీ ఏర్పడి ధర పెరిగినట్టు చెబుతున్నారు.అయితే ధర ఎంత వరకూ నిలబడి ఉంటుందనేది చెప్పలేమని కొనుగోలుదారులు చెబుతున్నారు. రైతులు గతం నుంచి రూ.300లకు విక్రయిస్తూ వచ్చారు. అలా అమ్మిన రైతులు ప్రస్తుత ధర చూసి బాధపడుతున్నారు. కోకో కాయలు కాపు తక్కు వగా ఉన్నా.. కాచిన కాయలు సైజు మాత్రం పెద్దగా ఉంటుందని లోపల గింజ సైజు కూడా పెద్దగా ఉంటుందని చెబుతున్నారు. గింజ నాణ్యత బాగుండడంతో కంపెనీలు పోటీ పడి కొనుగోలు చేస్తున్నాయి.

నాణ్యతగా ఆరబెట్టాలి

కోకో కాయలు కోసిన అనంతరం కాయలు నుంచి గింజలు వేరు చేస్తారు. అనంతరం వాటిని రాశిగా పోసి నాలుగైదు రోజుల పాటు పులియబెడతారు.ఈ క్రమంలో ఆ గింజలు రంగు మారతాయి. అనంతరం వాటిని ఎండలో ఆరబెట్టి విక్రయిస్తారు. కొంత మంది ఈ విధానం సక్రమంగా పాటించకపోవడం వల్ల గింజల్లో నాణ్యత రావడం లేదని కంపెనీలు ఆవేదన చెందుతున్నాయి.కాయలు నుంచి వేరు చేసిన 1,2 రోజులకే ఆరబెడుతున్నారని దీంతో అవి రంగు మారకుండా తెల్లగా అవుతున్నాయని.. రైతులు సరైన విధానం పాటించాలని కోరుతున్నారు.

రాజమండ్రి లోక్‌సభకు పురందేశ్వరి



సీనియర్ ఎన్‌టీఆర్ కుమార్తెగా సుపరిచితం

- కూటమి అభ్యర్థిగా ప్రకటించిన బీజేపీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా తనదైన ముద్ర
- జాతీయ రాజకీయాల్లో రాణిస్తున్న వైనం
- గతంలో కేంద్ర మంత్రిగా చేసిన అనుభవం
- టీడీపీ-జనసేన- బీజేపీ శ్రేణుల్లో జోష్
- త్వరలో రాజమహేంద్రవరానికి రాక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేరు ఖరారైంది. ఎప్పటి నుంచో ఆమె అభ్యర్థిత్వంపై ప్రచారం ఉన్నప్పటికీ ఆదివారం రాత్రి బీజేపీ జాతీయ నాయకత్వం ఆమె పేరును ఖరారు చేసింది. రాష్ట్రంలో ఆరుగురు లోక్‌సభ అభ్యర్థుల పేర్లు ప్రకటించారు.అందులో పురందేశ్వరి పేరు కూడా ఉంది. ఆమె అభ్యర్థిత్వం ఖరారు కావడంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో జోష్ పెరిగింది. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ నందమూరి తారక రామారావు కుమార్తె కావడం కూటమికి బాగా కలిసి వచ్చే అంశం. అంతేగాక టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి స్వయానా సోదరి. ఎన్టీఆర్ కుటుంబం నుంచి వచ్చిన మహిళా నేతల్లో బాగా రాణిస్తున్న నేత ఆమె.గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. బీజేపీకి రాష్ట్రంలో తొలి మహిళా అధ్యక్షురాలిగా కూడా ఆమె ఎనలేని పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమె అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత బీజేపీలో కూడా జోష్‌పెరిగింది. క్యాడర్‌లో కదలిక వచ్చింది. అంతకుముందు నేతలుకేడర్ పట్టించుకోలేదని, కనీసం సొంత అనుచరులను గాలికి వదిలేశారనే అపవాదు ఉంది. అయితే పురందేశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎన్నికైన తరువాత బీజేపీలోని పాత, కొత్తనేతలందరినీ కలుపుకుంటూ ముందుకు వెళుతున్నారు. దానికి తోడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కృషితో టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు కూడా కుదిరింది.దీంతో ఆమెను చారిత్రిక రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా బరిలో దించారు. త్వరలో ఆమె ఇక్కడకు రానున్నారు.బీజేపీతో పాటు, టీడీపీ, జనసేన క్యాడర్‌ను కలుపుకుని ప్రచారం మొదలు పెట్టనున్నారు. రాజమహేంద్రవరం నుంచి గతంలో బీజేపీ రెండు సార్లు గెలిచిన సంగతి తెలిసిందే. లోక్‌సభకు రెండుసార్లు, అర్బన్ ఎమ్మెల్యే స్థానం నుంచి ఒకసారి గెలిచింది. రెండు సార్లు టీడీపీతో పొత్తు వల్లే గెలిచింది. ఈసారి ఏకంగా టీడీపీ -జనసేన కూడా కలవడంతో బీజేపీ అభ్యర్థికి బాగా బలం పెరిగినట్టు అయింది. ఈ లోక్‌సభ స్థానం గోదావరికి ఇటు ఇటూ ఉన్న ప్రాంతం. ఈ స్థానం టీడీపీకి కంచుకోట. పోల్‌మేనేజ్‌మెంట్ వర్గాల సమీకరణ వ్యూహాత్మకంగా ఉంటే టీడీపీ నుంచి ఈ స్థానాన్ని ఎవరూ తన్నుకుపోలేనంత క్యాడర్ టీడీపీకి ఉంది. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికలలో టీడీపీ మూడు సార్లు, బీజేపీ రెండు సార్లు, కాంగ్రెస్ నాలుగు సార్లు, వైసీపీ ఒకసారి గెలిచాయి. కానీ గెలిచిన ప్రతిసారి ఓట్లశాతం పరిశీలించినా, మెజార్టీ శాతం పరిశీలించినా టీడీపీయే అధికంగా ఓట్లు తెచ్చుకోవడం గమనార్హం. రాష్ట్ర విభజన తర్వాత మొదటగా జరిగిన 2014లో జరిగిన ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి సినీనటుడు మాగంటి మురళీ మోహన్ ఘన విజయం సాధించారు. అప్పట్లో 6,30,573 ఓట్లు అంటే 54.62 శాతం ఓట్లు సాధించారు. అంతకు ముందు జరిగిన ఎన్నికల కంటే అదనంగా 19.72 శాతం సాధించారు. ఇంత వరకూ ఎవరికీ రానంత మెజార్టీ ఆయనకు వచ్చింది. ఏకంగా 1,67,434 ఓట్ల మెజార్టీ లభించింది.ఇది 14.29 శాతం మెజార్టీ. అప్పట్లో వైసీపీ తరపున పోటీ చేసిన బొడ్డు వెంకటరమణ చౌదరికి 4,63,139 ఓట్లు వచ్చాయి.అది 40.12 శాతం. కానీ 2019లో తెలుగుదేశం, జనసేన వేర్వేరుగా పోటీచేసి దెబ్బతిన్నాయి. టీడీపీ తరపున మాగంటి మురళీమోహన్ కోడలు మాగంటి రూప పోటీ చేసి 4,60,390 ఓట్లు అంటే 36.82 శాతం తెచ్చుకోగలిగారు. జనసేన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ పోటీ చేసి 1,55,807 ఓట్లు అంటే 12.46 శాతం సాధించారు. ఈ ఇద్దరి మధ్య ఓట్లు చీలిపోవడంతో వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ 5,82,024 ఓట్లు అంటే 46.55 శాతం ఓట్లు సాధించి 1,21,634 ఓట్లు మెజార్టీ సాధించారు. ఇది 9.73 శాతం మెజార్టీ.. ఈసారి ఈ లెక్కలే కాక, అధికార పార్టీ మీద ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, టీడీపీ,జనసేన, బీజేపీ ఐక్యత వల్ల ఉమ్మడి అభ్యర్థి బలమే ఎక్కువ ఉంటుంది. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థిగా డా.గూడూరి శ్రీనివాసరావు బరిలో ఉన్న సంగతి తెలిసిందే. ఇక్కడ ద్విముఖ పోటీనే ఉంటుంది. ఈ లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ నేతలు చాలా మంది ఆశపెట్టుకున్నారు. రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఇక్కడ టికెట్ ఆశించారు. రాజానగరం టికెట్ ఇస్తానని మొదట్లో టీడీపీ అధిష్ఠానం ఆయనకు హామీ ఇచ్చింది. పొత్తులో అది జనసేనకు కేటాయించడంతో చివరకు లోక్‌సభ స్థానం నుంచి అవకాశం ఉంటుందనే ప్రచారం జరిగింది. 2014లో ఆయన వైసీపీ అభ్యర్థిగా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్, శిష్ఠా లోహిత్, గన్ని కృష్ణ, పార్టీ సమన్వయకర్త వై.రవి, వంటి వారు టికెట్ ఆశించారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు వల్ల కూటమి అభ్యర్థిగా పురందేశ్వరి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో మూడు పార్టీల్లోనూ జోష్ పెరిగింది.

ఉల్లంఘనులు నిజమే!

- నిబంధనలు మీరారని 96 కేసులు నమోదు
- సీ విజిల్ ద్వారా 151 ఫిర్యాదులు
- ఆంధ్రజ్యోతి కథనం అక్షర సత్యం

రాజమహేంద్రవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్న బాధ్యతా రహిత ఘనులపై 'ఈసీ చెప్పినా లెక్కలేదా' అనే శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం అక్షర సత్యమని అధికారులు వెల్లడించిన వివరాలు రుజువు చేశాయి. ఈ నెల 16న సాయంత్రం 3 గంటల సమయంలో ఎన్నికల షెడ్యూల్‌ని ప్రకటించారు.ఆ క్షణం నుంచీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. వెంటనే అధికార యంత్రాంగం చేయాల్సిన పనులను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా నిర్దేశించారు. 24, 48, 72 గంటల్లో కచ్చితంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చారు. అప్పటి నుంచీ ఉల్లంఘనలపై ప్రతి రోజూ 'ఆంధ్రజ్యోతి' హెచ్చరిస్తూనే ఉంది. అయితే 72 గంటల తర్వాత కూడా 24గంటల్లో జరగాల్సిన పనులు పూర్తి కాలేదు. అధికార పార్టీ హోర్డింగులు, ఫ్లెక్సీలు, బోర్డులు వంటివి తొలగించలేదు. ప్రధాన కూడళ్లలో ఉన్న వాటినీ వదిలేశారు. ప్రజాప్రతినిధులు ఈసీ ఆదేశాలపై పట్టింపు లేకుండా వ్యవహరించారు. వీటిపై మేలుకొలుపుతూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. అదే రోజున జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత ఓ సమావేశంలో పలు వివరాలను వెల్లడించారు. ఉల్లంఘనలపై తనిఖీలు చేస్తూ కేసులు పెడుతున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై పలు సెక్షన్ల ప్రకారం 96 కేసులు నమోదు చేశారన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా 151 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిలో రాజమండ్రి అర్బన్, రూరల్ నుంచి 61 ఉండడం గమనార్హం. ఎక్సైజ్‌కి సంబంధించి 13 కేసులు పెట్టారన్నారు. ఇవన్నీ 'ఆంధ్రజ్యోతి'లో 17వ తేదీ నుంచి ఉల్లంఘనలపై వెలువడిన కథనాలు నిజమేనని రుజువు చేస్తున్నాయి. ఉమెన్స్ కళాశాల జంక్షనులో జగన్ బొమ్మలతో ఉన్న పెద్ద హోర్డింగులు, శ్యామలా సెంటర్‌లో కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచి నిర్మాణ స్థలంలో జగన్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలు, తాడితోట జంక్షను సమీపంలోని రైల్వే స్థలంలో జగన్ బొమ్మతో హోర్డింగు తదితరాలను 'ఆంధ్రజ్యోతి' చెప్పిన తర్వాతే తొలగించడం గమనార్హం. అయితే.. బాధ్యులపై చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది.

ముగిసిన కోరుకొండ నరసన్న ఉత్సవాలు

నేడు స్వామికి శ్రీ పుష్పయాగం 8

అనపర్తిలో.. ఆందోళన



తాడోపేడో తేల్చుకుందాం : టిక్కెట్ మార్పుపై వస్తున్న వార్తల నేపథ్యంలో విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశానికి నల్లమిల్లి వెళ్లకుండా ఆపుతున్న టీడీపీ-జనసేన నాయకులు

సీటు బీజేపీకి కేటాయిస్తారన్న ప్రచారంపై భగ్గుమన్న టీడీపీ - జనసేన శ్రేణులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అనపర్తి సీటుపై ఆందోళన పెరిగింది. ఈ సీటు బీజేపీ ఆశిస్తున్నట్టు ప్రచారం జరగడంతో ఆందోళన మొదలైంది. టీడీపీ తొలి జాబితాలోనే అనపర్తి నుంచి కూటమి అభ్యర్థిగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయన విస్తృతంగా ప్రచారం కూడా చేస్తున్నారు.కానీ టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు ఖరారైన తర్వాత రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానాన్ని అడిగిన బీజేపీ, అనపర్తి అసెంబ్లీ స్థానాన్ని కూడా కోరినట్టు ప్రచారం జరుగుతోంది. ఆదివారం రాత్రి ఢిల్లీ నుంచి రాష్ట్రంలో బీజేపీ పోటీ చేసే 6 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు.ఈ నేపథ్యంలో అనపర్తి నుంచి కూడా బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తారేమోననే ఆందోళన మొదలైంది. బిక్కవోలు మండలం రంగాపురానికి చెందిన ఎక్స్ మిలటరీమ్యాన్ కృష్ణంరాజు అనపర్తి బీజేపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన పేరునే పార్టీవర్గాలు ప్రతిపాదించినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ టీడీపీ అధినేత చంద్రబాబు ఈ సీటును ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చేది లేదని, 42 ఏళ్ల నుంచి నల్లమిల్లి కుటుంబం టీడీపీతో ఉందని, అక్కడ ఇప్పటికే రామకృష్ణారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించామని కూడా స్పష్టం చేసినట్టు సమాచారం. ఢిల్లీలో కూడా దీనిపై చర్చ జరిగినట్టు సమాచారం. వైసీపీ నేత ఒకరు, మరొక పార్టీకి చెందిన నేత ఒకరు కుమ్మక్కయి,ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించేలా ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. అనపర్తి ఇవ్వకపోతే, రాజమహేంద్రవరం రూరల్ లేదా అర్బన్ ఇవ్వమని బీజేపీ జాతీయ స్థాయి నేత షెకావత్ చంద్రబాబును అడిగి నట్టు సమాచారం. ఆ ప్రతిపాదన పెట్టవద్దని.. అవి మార్చేసీట్లు కాదని స్పష్టం చేయడం గమనార్హం. రాజమహేంద్రవరం రూరల్, సిటీలలో ఇబ్బంది లేదుకానీ..అనపర్తి విషయంలో కొంత సందిగ్ధత నెలకొంది. ఇక్కడ అభ్యర్థి రామకృష్ణారెడ్డి ఐదేళ్ల నుంచి నిత్యం పోరాడుతూ ప్రజల్లో ఉంటున్న సంగతి తెలిసిందే. అంతేకాక ఇక్కడ రామకృష్ణారెడ్డి సీటును మారిస్తే, అది లోక్‌సభ స్థానంపై కూడా ప్రభావం చూపుతుందనే వాదన ఉంది. ఈ పరిస్థితులు ప్రస్తుతం రాష్ట్రంలోని బీజేపీకి కేటాయించిన 10 స్థానాల్లో 9 స్థానాలనే ముందుగా ప్రకటించే అవకాశం ఉందని, అనపర్తి గురించి పునారాలోచించడమో లేక, బీజేపీ 9 స్థానాలతో సరిపెట్టుకోవ డమో జరుగుతుందనే వాదన ఉంది. అయినా అనపర్తి టీడీపీ శ్రేణుల్లో ఆందోళన కొనసాగుతోంది. ఇక్కడ మరొక ప్రచారం కూడా ఉంది. అనపర్తి తప్పనిసరిగా బీజేపీకి ఇస్తే రామకృష్ణారెడ్డికి కానీ, ఆయన కుమారుడికి కానీ బీజేపీ కండువా కప్పి పోటీ చేయించే అవకాశం ఉన్నట్టు సమా చారం. టీడీపీ వర్గాల్లో ఆందోళన ఉన్నప్పటికీ ఈ సీటు టీడీపీదేననే నమ్మకంతో ఉన్నారు. ఆదివారం రామకృష్ణారెడ్డి ప్రచారానికి వెళుతుంటే, దీనిపై స్పష్టత వచ్చే వరకూ వెళ్లవద్దని శ్రేణులు అడ్డుకోవడం గమనార్హం. ఈ స్థానం నుంచి బీజేపీ ఎప్పుడూ గెలవలేదు. టీడీపీ అనేక సార్లు గెలిచింది. పొత్తు వల్ల ఎటువంటి పరిణామాలు సంభవిస్తాయో చూడాలి.

అనపర్తి టికెట్‌పై వైసీపీ కుట్ర
అధైర్యపడవద్దు..టిక్కెట్ మనదే..
టీడీపీ జనసేన శ్రేణులతో నల్లమిల్లి

అనపర్తి టికెట్ మార్పు అంశం పూర్తిగా అధికార పార్టీ చేస్తున్న కుట్రలో భాగం.. ఐదేళ్లుగా మనం వైసీపీ అవినీతి అక్రమాలపై చేస్తున్న పోరాటం వృథా కాదు. చంద్రబాబు మనకి అన్యాయం చేయరు. టీడీపీ జన సేన శ్రేణులు అధైర్యపడవద్దు... శనివారం విజయవాడలో జరిగిన సమావేశంలో పాల్గొన్న తరువాత తాను చంద్రబాబుతో సమావేశమై పలు అంశాలను చర్చించా.. సీటు మార్పు వెనుక వైసీపీ చేస్తున్న కుట్రను అధినేత చంద్రబాబుకు వివరించా. సీటు అంశంపై ఆందోళన పడవద్దని చంద్రబాబు తనతో అన్నారు. అనపర్తి నియోజకవర్గం బీజేపీకి కేటాయిస్తే రాజమండ్రి పార్లమెంటు స్థానానికి ఇబ్బందులు ఎదురవుతాయని చంద్రబాబుకు వివరించా.. సీటు అంశంపై కార్యకర్తలు ఆందోళన చెందవద్దు.

- టీడీపీ సీటు బీజేపీకా..?
- లోక్‌సభ సీటుపైనా ప్రభావం
- మిలట్రీ మ్యాన్ కృష్ణంరాజు పేరు?
- నియోజకవర్గంలో అయోమయం
- శ్రేణుల్లో తీవ్ర నిరుత్సాహం
- కుదరదన్న చంద్రబాబు
- పట్టుబడుతున్న బీజేపీ
- నాయకుల అసహనం
- అన్యాయం చేయవద్దని డిమాండ్

సీటు మారిస్తే ఊరుకోం

- టీడీపీ-జనసేన శ్రేణుల నిరసన
- ప్రచారానికి వెళ్లకుండా అడ్డగింత
- వెనుదిరిగిన నల్లమిల్లి
- అధిష్ఠానం తీరుపై తీవ్ర ఆగ్రహం
- సీటు సంగతి తేల్చాలని డిమాండ్
- బీజేపీకి ఎలా ఇస్తారని ప్రశ్న
- వైసీపీ కుట్ర అంటూ నినాదాలు

అనపర్తి, మార్చి 24 : అనపర్తి అసెంబ్లీ స్థానాన్ని పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయిస్తున్నారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో నియోజకవర్గంలో టీడీపీ-జనసేన శ్రేణులు ఆదివారం భగ్గుమన్నాయి. అనపర్తి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా మొదటి జాబితాలోనే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించారు. తరువాత జరిగిన పరిణామాల్లో రెండు పార్టీలు బీజేపీతో జతకట్టాయి. ఇటీవల బీజేపీకి కేటాయించిన పది అసెంబ్లీ స్థానాల్లో అనపర్తి కూడా ఉందని ప్రచారం జరుగుతూ వచ్చింది. అయితే ఇది ప్రచారం కాదని వారు అడుగుతున్న సీట్ల జాబితాలో అనపర్తి కూడా ఉందని తేలడంతో ఆదివారం టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ముందుగా బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించేందుకు వెళ్లిన నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మిని టీడీపీ జనసేన పార్టీ శ్రేణులు అడ్డుకున్నారు. అనపర్తి సీటుపై టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన ప్రకటన చేయాలని అప్పటి వరకు ప్రచారం చేయవద్దని నాయకులు పట్టుబట్ట డంతో ఆమె అక్కడి నుంచి వెనుదిరిగారు. రంగంపేట మండలం నల్లమిల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించేందుకు వెళ్లిన నల్లమిల్లి తనయుడు మనోజ్‌రెడ్డిని కూడా రంగంపేట టీడీపీ జనసేన నాయకులు కార్యకర్తలు అడ్డుకుని సీటుపై క్లారిటీ వచ్చే వరకు ప్రచారం నిర్వహించవద్దంటూ అడ్డుకోవడంతో ఆయన వెనుదిరిగారు. బిక్కవోలులో అనపర్తి నియోజకవర్గ విశ్వ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో పాల్గొనేందుకు ఉమ్మడి అభ్యర్థి రామకృష్ణారెడ్డి వస్తున్నారన్న విషయం తెలుసుకున్న రంగంపేట, బిక్కవోలు మండలాలకు చెందిన టీడీపీ జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని నల్లమిల్లిని ఆత్మీయ సమావేశానికి హాజరు కాకుండా నిలుపుదల చేశారు.అనపర్తి సీటుపై అధిష్ఠానం స్పష్టత ఇవ్వాలని పలు వురు నాయకులు డిమాండ్ చేశారు. నియోజకర్గంలో బీజేపీకి చెప్పుకోదగ్గ నాయకుడు కూడా లేని పార్టీకి టికెట్టు ఎలా ఇస్తా రంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు కార్యకర్తల అభీష్టం మేరకు ఆత్మీయ సమావేశంలో పాల్గొనకుండానే రామకృ ష్ణారెడ్డి వెనుదిరిగారు. అనపర్తి సీటు టీడీపీని కాదని బీజేపీకి ఎలా కేటాయిస్తారని..గత ఎన్ని కల్లో 615 ఓట్లు సాధించిన పార్టీకి కేటాయిస్తే విజయం సాధించడం కష్టమని టీడీపీ జిల్లా తెలుగురైతు అధ్య క్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు అన్నారు. ఇదే అదునుగా వైసీపీ బలం పుంజుకోవాలని చూస్తుందన్నారు.పార్టీ ప్రతిష్టను పెంచేందుకు రామకృష్ణారెడ్డి రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడుతున్నారని దీనిపై అధిష్ఠానం వెంటనే స్పందించి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే టీడీపీకి రాజీనామాలు చేసేందుకు కూడా పార్టీ శ్రేణులు సిద్ధపడుతున్నా రన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదాను రెడ్డి, కర్రి వెంకటరామ రెడ్డి, వైజాగ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వదలొద్దు : ప్రచారానికి వెళ్లకుండా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భార్య మహాలక్ష్మిని ఆపుతున్న టీడీపీ-జనసేన శ్రేణులు